
# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 230 | హైదరాబాద్ | గురువారం 05-03-2026 | పేజీలు : 12 | వెల : 1.00



11లో
దుబాయ్‌లో డ్రోన్ కలకలం: అమెరికా కాన్సులేట్ సమీపంలో పేలుడు..

## జూన్ నాటికి సింగూరు డ్యామ్
# సేఫ్టీ పనులను పూర్తి చేయాలి

- జులై నెలాఖరులోగా రైతులకు సాగు నీరందించాలి
- పెద్దారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం డీపీఆర్ రూపొందించాలి..
- ఉగాది లోగా పనులకు శంకుస్థాపన చేయాలి..


11లో



## హైదరాబాద్ బాచుపల్లిలో
# భారీ అగ్నిప్రమాదం

- 20కి పైగా ఫర్నిచర్ దుకాణాలు పూర్తిగా దగ్ధం
- గ్యాస్ సిలిండర్లు పేలడంతో పెరిగిన మంటల తీవ్రత
- షార్ట్ సర్క్యూట్‌తోనే ప్రమాదం జరిగిందని ప్రాథమిక అంచనా

11లో



# గల్ఫ్‌లో ఉద్రిక్తతలు...
## భారతీయుల తరలింపునకు 58 ప్రత్యేక విమానాలు

11లో

- మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల నేపథ్యంలో భారతీయుల తరలింపు
- నేడు 58 ప్రత్యేక విమానాలను నడుపుతున్న ఇండియన్ క్యారియర్లు
- ఇండిగో 30, ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ 23 ఫ్లైట్స్ ఏర్పాటు
- టికెట్ ధరలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్న పౌర విమానయాన శాఖ
- నిర్ధారణ లేకుండా ఎయిర్‌పోర్టులకు రావొద్దని ప్రయాణికులకు సూచన

## శ్రీలంక తీరానికి సమీపంలో
# ఇరాన్ యుద్ధనౌకను ముంచేసింది మేమే

- ఇరాన్ యుద్ధనౌకను తమ సబ్‌మెరైన్ కూల్చేసిందని అమెరికా రక్షణ మంత్రి ప్రకటన
- శ్రీలంక తీరంలో మునిగిపోయిన ఇరాన్ నౌక ఐరిస్ దేనా
- సముద్రంలో 32 మందిని రక్షించిన శ్రీలంక నావికాదళం
- నౌకలో మొత్తం 180 మంది సిబ్బంది ఉన్నట్లు విదేశాంగ మంత్రి వెల్లడి
- ఘటనా స్థలిలో చమురు తెట్టుగుర్తింపు.. కొనసాగుతున్న సహాయక చర్యలు

11లో




11లో

## డిజిటల్ జనగణనకు తెలంగాణ సిద్ధం..
# మే 11 నుంచి తొలి దశ

- తెలంగాణలో జనగణన తొలి దశకు రంగం సిద్ధం
- మే 11 నుంచి జూన్ 9 వరకు ఇళ్ల వివరాల సేకరణ
- దేశంలోనే తొలిసారిగా పూర్తి డిజిటల్ విధానంలో లెక్కింపు
- సొంతంగా వివరాలు నమోదు చేసుకునేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్
- ఏ ఒక్క ఇల్లు వదలకుండా పక్కాగా లెక్కించాలని అధికారులకు ఆదేశాలు



## వర్సిటీలను బంధుగణంతో నింపేసి
# భ్రష్టుపట్టించారు

- అసెంబ్లీ చాంబర్‌లో ఎఫ్‌బీఎంఎస్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష
- వివిధ శాఖల నుంచి సమాచారాన్ని సమీకృతం చేయాలని సూచన
- ఏప్రిల్ 30 నాటికి 90 శాతం డేటాబేస్ సిద్ధం చేయనున్న అధికారులు
- 26 రకాల అంశాలతో పకడ్బందీగా డేటాబేస్ రూపొందించాలన్న సీఎం


11లో

## ఇవి మనిషి సృష్టించిన తీవ్ర విషాదాలు: కేటీఆర్


11లో

## 26 రకాల వివరాలతో
# ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కార్డు

- అసెంబ్లీ చాంబర్‌లో ఎఫ్‌బీఎంఎస్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష
- వివిధ శాఖల నుంచి సమాచారాన్ని సమీకృతం చేయాలని సూచన
- ఏప్రిల్ 30 నాటికి 90 శాతం డేటాబేస్ సిద్ధం చేయనున్న అధికారులు
- 26 రకాల అంశాలతో పకడ్బందీగా డేటాబేస్ రూపొందించాలన్న సీఎం


11లో

భారత శక్తి®
VOICE OF INDIAN

# 400 కోట్ల బంగారం ఎక్కడ

పోలీసుల ఎదుట కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ తో మావోయిస్టు పార్టీ కుదెలైపోయింది. ఇప్పటికే వందలాది మంది మావోలు మృత్యువాత పడగా, పలువురు అగ్రనేతలు పోలీసులు ఎదుట లొంగిపోయారు. దేవ్‌జీ, మల్ల రాజిరెడ్డి, మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న, నరసింహారెడ్డి వంటి అగ్రనేతలంతా లొంగిపోవడంతో ఇక ఆ పార్టీ దేశంలో కనుమరుగవ్వడం ఖాయమనే ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో వారు పార్టీ కోసం సేకరించిన డబ్బు, నగలు ఎక్కడున్నాయనే విషయంలో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. కేవలం డబ్బు, బంగారవే కాకుండా మావోయిస్టులకు సంబంధించిన పలు విలువైన డ్యాక్యుమెంట్లు, ఆధునిక ఆయుధాలు అడవుల్లో రహస్య ప్రదేశాల్లో దాచి ఉంచినట్లు ప్రచారం సాగుతోంది. వాటి వివరాలను సేకరించడం కోసం కేంద్ర దర్యాప్తు సంస్థలు మావోయిస్టు పార్టీ అగ్రనేతలను తీవ్రంగా ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టుల్లో అగ్రనేతలుగా ఉన్నవారంతా ప్రస్తుతం పోలీసుల సమక్షంలో ఉన్నారు. దీంతో పార్టీ నిధులు, నిల్వల గురించి వారికి తెలిసి ఉంటుందన్న కోణంలో విచారిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికోసం కేంద్ర నిఘా సంస్థలు ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్నాయి. కేంద్ర నిఘా వర్గాలకు చెందిన ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ), నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ), రిసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా), ఆర్మీ ఇంటెలిజెన్స్‌తో పాటు కేంద్ర సాయుధ బలగాలకు చెందిన సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్ తదితర బృందాలు ఇప్పటికే వారిని పలు విషయాలపై ప్రశ్నిస్తున్నాయి. గడచిన ఆరు నెలల కాలంలో మావోయిస్టు పార్టీకి చెందిన అగ్రనేతలు ఒక్కరొక్కరుగా లొంగిపోతున్న విషయం తెలిసిందే. వారు లొంగిపోతున్న సమయంలో కొంతమది నేతలు తమ వద్ద ఉన్న ఆయుధాలు, నగదు, డబ్బు పార్టీ అధీష్టానానికి అప్పగించి వచ్చినట్లు చెబుతున్నారు. మరికొంతమంది ఆయుధాలతో లొంగిపోయినప్పటికీ పార్టీకి చెందిన నిధులు, బంగారం మాత్రం అడవుల్లో ఉన్న క్యాడర్ కు అప్పగించి వచ్చినట్లు చెబుతున్నారు. ఇటీవల లొంగిపోయిన కేంద్ర కమిటీ సభ్యులు, పొలిట్‌బ్యూరో మెంబర్ మల్లోజుల వేణుగోపాల్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. తాము ఆయుధాలతో విప్లవం రాదు అని నమ్మాం కనుక తమ వద్ద ఉన్న ఆయుధాలతో లొంగిపోయామని, అయితే ఇంకా పార్టీలో ఉన్న క్యాడర్ అడవుల్లో ఉండి పోరాడేందుకు సిద్ధంగా ఉండటంతో తన వద్ద ఉన్న ఆరుకోట్ల రూపాయల నగదు, ఆరు కిల్లో బంగారం పార్టీ నేతలకు అప్పగించి వచ్చినట్లు స్పష్టం చేశారు. దాన్ని భూతల్లి కడుపులోనే దాస్తామని కూడా ఆయన వెల్లడించారు. మావోయిస్టు పార్టీ వద్ద పెద్ద ఎత్తున ఆయుధాలతోపాటు వందల కోట్ల రూపాయలు, అంతకు మించి విలువైన బంగారం ఉందని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవలి కాలంలో మావోయిస్టు అగ్రనేతల్లో ఒకరు, పీఎల్‌జీఏ కమాండర్ అయిన బార్సేదేవాను పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. ఆ సమయంలో తెలంగాణ చరిత్రలోనే మొదటి సారిగా మావోయిస్టు డంప్ నుంచి రూ.20 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకోవడం గమనార్హం. అలాగే 48 అత్యంత అధునాతన ఆయుధాలు పోలీసులకు మావోయిస్టులు అప్పగించారు. మావోయిస్టులు కొవిడ్ సమయంలో తమ వద్ద ఉన్న కోట్లాది రూపాయల నగదును బంగారం రూపంలోకి మార్చినట్లు తెలుస్తోంది. ఝార్ఖండ్, ఛత్తీ?సగఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిసా, ఏపీ తదితర రాష్ట్రాల్లోని కాంట్రాక్టర్లు, వ్యాపారవేత్తల నుంచి మావోయిస్టులు పార్టీ ఫండ్ సేకరించినట్లు తెలుస్తోంది. ఈ మొత్తాన్ని కేంద్ర కమిటీకి పంపిస్తుంటారు. పార్టీకి నిధుల సేకరించడానకి విస్తృత నెట్‌వర్క్ ఉందని జాతీయ విచారణ సంస్థ (ఎన్ఐఏ) ధృవీకరించింది. ఈ క్రమంలోనే సుమారు రూ.400 కోట్ల విలువైన నగదును బంగారం రూపంలోకి మార్చినట్లు తెలుస్తోంది. అయితే అది ఎవరివద్ద ఉందనేది ప్రస్తుతం సస్పెన్స్..ఇక బీజాపూర్ పోలీసులు మూల్‌వాసీ బచావో మంచ్ (ఎంబీఎం) సభ్యులు ఇద్దరు మావోయిస్టుకు పార్టీకి చెందిన బ్యాంకు ఖాతాలో రూ.6 లక్షలు డిపాజిట్ చేస్తుండగా అరెస్టు చేశారు. మజ్దూర్ సంఘటన సమితి (ఎంఎస్ఎస్) సభ్యులు కొందరు నిధులు సేకరించి, బ్యాంకుల్లో డిపాజిట్లు చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. గతంలో మావోయిస్టు స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడైన ప్రద్యుమ్నశర్మ బంధువు ఒకరు చెన్నైలోని వైద్య కళాశాలలో చేరగా, ఆమె ఫీజుకు కావాల్సిన కోటి 13 లక్షలను బ్యాంకు ఖాతాల ద్వారా ఇచ్చినట్లు ఎన్ఐఏ గుర్తించడం సంచలనంగా మారింది. పార్టీ సానుభూతి పరుల వద్దే ఇంత సొమ్ము ఉంటే ఇంకా పార్టీ డంపులలో ఎంత మేరకు ఉంటుందన్న చర్చ సాగుతోంది. మావోయిస్టు పార్టీ నోట్ల మార్పిడి సమయంలో తీవ్రంగా నష్టపోయినట్లు పార్టీ అగ్రనేతలు చెబుతున్నారు. సుమారు రూ.200 కోట్ల వరకు పాత నోట్లను మార్పిడి చేసేందుకు పార్టీ అగ్రనాయకత్వం ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కొంతమొత్తాన్ని మార్చినప్పటికీ మిగతది సాధ్యం కాలేదని చెబుతున్నారు. నోట్ల మార్పిడి కోసం పార్టీ సానుభూతిపరులు, ఇతర వర్గాల వారికి పార్టీ నగదును అప్పగించగా వారు డబ్బును మార్చినప్పటికీ తిరిగి పార్టీకి ఇవ్వలేదన్న ప్రచారం ఉంది. దీన్ని అగ్రనేత ఒకరు ధృవీకరించారు కూడా. అలా పెద్దమొత్తంలో పార్టీ ఆర్థికంగా నష్టపోయినట్లు నేతలు చెబుతున్నారు. మావోయిస్టు పార్టీ వద్ద సుమారు400 కిలోల బంగారం ఉండి ఉంటుందని దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. అయితే దాన్ని ఎక్కడ దాచారనేది ప్రస్తుతం చర్చనీయంశంగా మారింది. బంగారాన్ని అంతా అడవుల్లోని డంపు ల్లో దాచి ఉండటారని కేంద్ర, రాష్ట్ర నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. దాదాపు రూ.500 కోట్ల బంగారం మావోయిస్టు పార్టీ వద్ద ఉందనే అనుమానంతో ఆయా సంస్థలు మావోయిస్టులను ప్రశ్నిస్తున్నాయి. అయితే పార్టీ అగ్రనేతలు పార్టీ నిలువుల గురించి నోరు తెరుస్తారా? లేదా అనేది ప్రస్తుతం మిలియన్ డాలర్ల ప్రశ్న.

# ఉగాదికి ఏం జరగుతుంది...

విజయవాడ, మార్చి 4,

ఏపీలో కూటమి ప్రభుత్వం కొత్త నిర్ణయాలు దిశగా అడుగులు వేస్తోంది. అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్న తరుణంలో సమూల మార్పులు తీసుకురావాలని భావిస్తోంది. ముఖ్యంగా పాలనలో విప్లవాత్మక మార్పులు ప్రారంభించాలని చూస్తోంది. అందులో భాగంగా ఒక కొత్త మంత్రిత్వ శాఖను తెరపైకి తెస్తోంది. సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ అనే కొత్త శాఖ రానున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ శాఖ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దగ్గరే ఉంది. అయితే దీని పేరిట ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసి ఒక మంత్రికి బాధ్యతలు కట్టబెట్టె అవకాశం ఉంది. అయితే ఈ ఒక్క శాఖ కోసం మంత్రివర్గ విస్తరణ చేపడతారా? లేకుంటే భారీ ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తారా? అన్నది తెలియాల్సి ఉంది. రేపు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ ఉంది. ఈ సమావేశంలో మంత్రివర్గ విస్తరణకు సంబంధించి కీలక నిర్ణయం దిశగా అడుగులు వేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి ఉగాది నాటికి మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న ప్రచారం నడుస్తోంది. ప్రస్తుతం ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. మార్చి 7 వరకు కొనసాగనున్నాయి. తరువాత మంత్రివర్గ విస్తరణ పై ఒక క్లారిటీ రానుంది. కానీ అసెంబ్లీ లాబీల తో పాటు ఎమ్మెల్యేలు ఒకచోటకు చేరే క్రమంలో దీనిపైనే చర్చ నడుస్తోంది. ప్రముఖంగా ఓ ఐదుగురు పేర్లు వినిపిస్తున్నాయి. అయితే సమూల ప్రక్షాళన ఉంటుందన్న ప్రచారం మాత్రం నడుస్తోంది. టిడిపి నుంచి చాలామంది మంత్రులను తొలగించి కొత్త వారికి అవకాశం ఇస్తారని తెలుస్తోంది. అయితే ఇప్పటికే మెగా బ్రదర్ నాగబాబు కు మంత్రి పదవి ఖాయమని ఏనాడో తేలిపోయింది. అయితే కొత్తగా ఏర్పాటు చేసే సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ శాఖను ఆయనకు అప్పగించే అవకాశం ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమావేశం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. హోలీ రోజున ఈ ఇద్దరు లంచ్ మీటింగ్ ఏర్పాటు చేసుకోవడానికి గల కారణాలపై అనేక రకాలుగా చర్చ జరుగుతుంది. కేవలం నామినేటెడ్ పోస్టులు, పాలనాపరమైన విషయాలపై చర్చించడానికి ఈ భేటీ జరిగిందని ఎవరూ అనుకోవడం లేదు. బలమైన కారణం ఉంటుందనే భావిస్తున్నారు. తిరుమల లడ్డూ వ్యవహారం ప్రధానంగా కూటమి ప్రభుత్వానికి ఇబ్బందిగా మారిందని సొంత పార్టీ నేతలే అభిప్రాయపడుతున్నారు. అనవసరంగా లడ్డూను పొడిగించి దానిని తెగే వరకూ టీడీపీ నాయకత్వమే లాగుతున్నారని సొంత పార్టీ నేతల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు తాజాగా తిరుమలకు సంబంధించిన అనేక విషయాలు సోషల్ మీడియాలో నెట్టింట్ కనిపించడం, దానిపై ఎవరూ ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో అది కూడా తమ ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుందని భావిస్తున్నారు. అందుకోసమే ప్రధానంగా ఈ సమావేశం జరుగుతుందని తెలిసింది. ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికి అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తారని, ప్రజల్లోకి మాత్రం కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతుందన్న అభిప్రాయం కూడా నేతల్లో కలుగుతుంది. అనవసరంగా రాద్ధాంతం చేయకుండా దీనికి ఫుల్ స్టాప్ ఎలా పెట్టాలి? ఎండ్ కు ఎలా తీసుకెళ్లాలన్న దానిపైనే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ల మధ్య చర్చ జరిగే అవకాశముందని పార్టీ నేతలు చెబుతున్నారు. కూటమిలోని టీడీపీ, జనసేన ప్రజాప్రతినిధులు చాలా జాగ్రత్తగా ఉండాలని, ప్రధానంగా వివాహేతర సంబంధాల విషయాలు కూటమి ప్రభుత్వాన్ని ఇబ్బందికరంగా మారాయి. ఇటీవల రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ను లక్ష్యంగా చేసుకోవడంతో పాటు తాజాగా మరొక దేవస్థానం కమిటీ ఛైర్మన్ పై కూడా ఆరోపణలు చేయడం పార్టీ ప్రతిష్ట మంటగలుస్తుందని, ఇటువంటి విషయాలు ప్రజల్లోకి వేగంగా, తొందరగా చొచ్చుకు వెళతాయని అందుకే దీనిపై ఎలా ముందుకు వెళ్లాలన్న దానిపై పవన్, చంద్రబాబు నాయుడులు చర్చించినట్లు సమాచారం. అయితే యాక్షన్ తీసుకుంటే ఎలా ఉంటుంది? తీసుకోకుండా దీనిపై ఎలా ముందుకు వెళ్లాలన్న దానిపై కూడా చర్చ నడిచినట్లు విశ్వసనీయ సమాచారం. కూటమిలో బీజేపీ నేతల జోలికి వెళ్లే ధైర్యం లేక, జనసేన, టీడీపీ నేతలనే వైసీపీ లక్ష్యంగా చేసుకుందన్న అభిప్రాయం కూడా ఈ భేటీలో వ్యక్తమయినట్లు తెలిసింది

# రంగంలోకి దిగిన ఏకసభ్య కమిషన్

తిరుమల, మార్చి 4, )

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యి కల్తీ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ వ్యవహారంపై మరింత లోతైన విచారణ కోసం, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడటం కోసం విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ ఇప్పుడు తన విచారణను వేగవంతం చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కి సరఫరా అయిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందన్న నివేదిక బయటకు రావడంతో కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. ఈ అంశంపై ఇప్పటికే సిట్, సిబిఐ విచారణలు చేశాయి. వాటిని ఆధారంగా చేసుకుని గత ప్రభుత్వ హయాంలో నెయ్యి సేకరణ విధానాలు, టెండర్ల ప్రక్రియ, నాణ్యత పరీక్షల్లో జరిగిన లోపాలను వెలికితీయడానికి ప్రభుత్వం దినేష్ కుమార్ కమిషన్‌ను నియమించింది. దినేష్ కుమార్ కమిషన్ కేవలం కల్తీ జరిగిందా లేదా అని తేల్చడానికే పరిమితం కాకుండా, వ్యవస్థాగత మార్పులపై దృష్టి సారించనుంది. తక్కువ ధరకే నెయ్యి సరఫరా చేసేందుకు కంపెనీలు ఎలా ముందుకు వచ్చాయి? నిబంధనల ఉల్లంఘన జరిగిందా? అన్నది పరిశీలిస్తుంది. టీటీడీ ల్యాబ్‌లలో పరీక్షలు ఎందుకు విఫలమయ్యాయి? సరఫరాదారులు పంపిన నమూనాలను నిశితంగా ఎందుకు పరిశీలించలేదు? లాంటి అనేక అంశాలను సమీక్షిస్తుంది. గత బోర్డు నిర్ణయాల్లో రాజకీయ ఒత్తిళు ఏమైనా ఉన్నాయా అన్న కోణంతో పాటు భవిష్యత్తులో నెయ్యి సేకరణ ఎలా ఉండాలి? స్వచ్ఛమైన ఆవు నెయ్యిని సేకరించేందుకు అత్యుత్తమ మార్గాలేవి? అనే అంశాలపై నివేదిక ఇవ్వనుంది. కమిషన్ ఇప్పటికే తన కార్యకలాపాలను ప్రారంభించింది. తిరుమల చేరుకున్న దినేష్ కుమార్, నెయ్యి ట్యాంకర్ల రికార్డులు, మార్కెటింగ్ విభాగం ఫైళ్లను కమిషన్ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గత ఐదేళ్లలో నెయ్యి సరఫరా చేసిన కాంట్రాక్టర్ల వివరాలు, వారి అర్హతలు, అప్పట్లో టీటీడీ అధికారులు తీసుకున్న నిర్ణయాలపై ఆరా తీస్తున్నారు. ముఖ్యంగా, రివర్స్ టెండరింగ్ పేరుతో నాణ్యతను పక్కన పెట్టి ధరకే ప్రాధాన్యత ఇవ్వడం వల్లనే ఈ సమస్య తలెత్తిందా అన్నది కమిషన్ ప్రధానంగా విశ్లేషిస్తోంది. ఈ కమిషన్ ఏర్పాటుపై ప్రతిపక్షాల నుండి కొన్ని విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇప్పటికే సిట్ విచారణ జరుగుతుండగా, మళ్లీ ఐఏఎస్ కమిషన్ అవసరమా అన్నది వారి ప్రశ్న. అయితే, సిట్ అనేది క్రిమినల్ కోణంలో ఎవరు నేరం చేశారనేది విచారిస్తుంది, కానీ దినేష్ కుమార్ కమిషన్ పరిపాలనాపరమైన లోపాలను సరిదిద్దడానికి ఉద్దేశించినదని ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. దినేష్ కుమార్ కమిషన్ ఇచ్చే నివేదిక టీటీడీ చరిత్రలో అత్యంత కీలకం కానుంది. కేవలం నిందితులను శిక్షించడమే కాకుండా, రాబోయే రోజుల్లో తిరుమలకు నెయ్యి సరఫరా చేసే కంపెనీలకు కఠినమైన నిబంధనలు, అత్యాధునిక ల్యాబ్ పరీక్షలు, పారదర్శకమైన సేకరణ విధానాలను ఈ కమిషన్ సూచించనుంది. ఈ విచారణ ద్వారా వాస్తవాలు బయటకు వచ్చి, శ్రీవారి ప్రసాదానికి మళ్లీ పూర్వ వైభవం లభిస్తుందని భక్తులు ఆశిస్తున్నారు

# హైదరాబాద్ కు గంటన్నర లోపే...

విజయవాడ, మార్చి 4,

తెలంగాణ రాష్ట్రంలోని ఫ్యూచర్ సిటీ నుంచి ఏపీ రాజధాని అమరావతి మధ్య ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు సమాంతరంగా అత్యాధునిక సెమీ బుల్లెట్ ట్రైన్ రానుంది. ఇది అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి అమరావతికి గంటన్నరలో దూసుకెళ్లొచ్చు. హైదరాబాద్ నుంచి చెన్నైకు కేవలం 3 నుంచి 3.30 గంటల్లోనే చేరుకోవచ్చు. మార్గంలో సెమీ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు పనులు ప్రారంభానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. హైస్పీడ్ కారిడార్ అలైన్‌మెంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన సూచనలతో ప్రాజెక్టు స్వరూపమే పూర్తిగా మారిపోయింది. గతంలో పేర్కొన్న రూట్‌కు బదులు ప్రస్తుతం నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే పక్కనుంచే రైల్వేలైన్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ప్రభుత్వం ప్రతిపాదనకు రైల్వేశాఖ పచ్చజెండా ఊపింది. దీంతో హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా చెన్నైకు వెళ్లే హైస్పీడ్ రైలుకు మిర్యాలగూడ మీదుగా సాగే కొత్త మార్గంలో ప్రాథమిక సర్వే పూర్తిచేసి, అలైన్‌మెంట్ డ్రాఫ్ట్‌ను రైల్వే బోర్డు సిద్ధం చేసింది. హైదరాబాద్ టూ చెన్నై హైస్పీడ్ రైల్వే ప్రాజెక్టు పూర్తయితే.. ఏపీ, తెలంగాణ రాజధానుల మధ్య దూరం సగానికిసగం తగ్గుతుంది. ప్రస్తుతం రైలులో హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లాలంటే ఐదు గంటల సమయం పడుతుంది. అదే సెమీ బుల్లెట్ ట్రైన్ అందుబాటులోకి వస్తే గంటన్నర సమయంలోనే హైదరాబాద్ నుంచి ఏపీ రాజధానికి చేరుకోవచ్చు. ఇదిలాఉంటే.. ఒకే కారిడార్‌లో రోడ్డు, రైలు మార్గాలు ఉండటం వల్ల లాజిస్టిక్స్ ఖర్చు భారీగా తగ్గుతుంది. సెమీ బుల్లెట్ ట్రైన్ గంటకు 250 కిలోమీటర్ల పైచిలుకు వేగంతో దూసుకుపోయేలా టెక్నాలజీని వినియోగిస్తారు. దీంతో ఈ కారిడార్‌ను నేరుగా చెన్నై వరకు పొడిగించడం ద్వారా హైదరాబాద్ టూ చెన్నైకు మూడు నుంచి మూడున్నర గంటల్లోనే చేరుకోవచ్చు. ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని రాబోయే ఐదేళ్లలోపు పూర్తి చేయాలని పక్కా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. డీపీఆర్ పూర్తయిన వెంటనే ఏఏ గ్రామాల మీదుగా అలైన్‌మెంట్ వెళ్తుందనే కచ్చితమైన వివరాలతో త్వరలో నోటిఫికేషన్లు వెలవడే అవకాశం ఉంది.

# తమిళనాడుపై రోజా ఫోకస్

తిరుపతి, మార్చి 4,

ఏపీ రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్ గా గుర్తింపు పొందిన రోజా ఇప్పుడు తమిళంపై ఫోకస్ పెట్టినట్లు కనిపిస్తున్నారు. ముఖ్యంగా అక్కడి డీఎంకే అధినేత స్టాలిన్ పుట్టినరోజు వేడుకలకు హాజరై సందడి చేశారు రోజా. డీఎంకేకు మద్దతుగా తన గళం వినిపించారు.



సమాజంలో మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్న స్టాలిన్ సర్కార్ ను మరోసారి ఎన్నుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారుస్టాలిన్ అందిస్తున్న సంక్షేమ పథకాలను రోజా ఆకాశానికెత్తారు. ముఖ్యంగా తమిళనాడులో మహిళల ఆర్థిక భద్రత కోసం ప్రతినెలా వారి ఖాతాల్లో నేరుగా వెయ్యి రూపాయలు జమ చేయడం వంటి పథకాలు మహిళా సాధికారతకు నిదర్శనమని ఆమె కొనియాడారు. ఇదే తరుణంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఏపీలో మహిళలకు నేరుగా నగదు అందిస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు గడుస్తున్నా, ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ పట్ల ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి ప్రతిపక్షాలకు భయం పట్టుకుందని రోజా వ్యాఖ్యానించారు. ఇటీవల మహిళల ఖాతాల్లో ఒకేసారి ఐదు వేల రూపాయలు జమ చేయడంతో విపక్ష నేతలకు ఏం చేయాలో పాలుపోవడం లేదని ఎద్దేవా చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని తాను పూర్తిస్థాయిలో సమర్థిస్తున్నానని, దీనివల్ల కూలి పనులకు వెళ్లే పేద మహిళలకు, విద్యార్థులకు ఎంతో ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని అభిప్రాయపడ్డారు. ఇంతటి గొప్ప మనసున్న నాయకుడిని తమిళ ప్రజలు భారీ మెజారిటీతో మళ్లీ గెలిపించుకోవాలని, సంక్షేమ పథకాల ద్వారా పొందుతున్న లబ్ధికి ప్రతిఫలంగా స్టాలిన్‌కు ఓటు వేసి రుణం తీర్చుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఒకవైపు ఏపీ రాజకీయాల్లో చురుగ్గా ఉంటూనే, తమిళ గడ్డపై డీఎంకే తరపున రోజా గళం విప్పడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. యస్సార్ కాంగ్రెస్ పార్టీ తమిళనాడు ఎన్నికల్లో స్టాలిన్ పార్టీకి మద్దతుగా నిలవాలని చూస్తోంది. ఎందుకంటే తమిళనాడులో తెలుగు ప్రజలు అధికం. ఆపై రాయలసీమకు దగ్గరగా ఉంటుంది తమిళనాడు. ఈ క్రమంలో మరికొద్ది రోజుల్లో జరిగే ఎన్నికల్లో స్టాలిన్ పార్టీ గెలవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలంగా కోరుకుంటుంది. కరుణానిధి ఉండే సమయంలో చంద్రబాబుతో ఆయనకు మంచి సంబంధాలు ఉండేవి. స్టాలిన్ విషయానికి వస్తే చంద్రబాబుతో మంచి సంబంధాలే కానీ.. కేంద్రంలో బిజెపితో టిడిపి ఉండడంతో స్టాలిన్ స్నేహానికి అడ్డంకిగా మారింది. అదే సమయంలో జగన్మోహన్ రెడ్డితో మంచి సంబంధాలు కొనసాగిస్తూ వచ్చారు స్టాలిన్. ఈ నేపథ్యంలో తమిళనాడు ఎన్నికల్లో స్టాలిన్ పార్టీకి మద్దతుగా ప్రచారం చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయించినట్లు సమాచారం. బలం పెంచుకోవాలనుకుంటున్న బిజెపి.. తమిళనాడులో బలం పెంచుకోవాలని చూస్తోంది భారతీయ జనతా పార్టీ. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు షేర్ పెరిగింది ఆ పార్టీకి. సీట్ల పరంగా ఒక్కటి కూడా రాకపోయినా ఓట్ల పరంగా మాత్రం మెరుగుపడింది. అందుకే ఈసారి మిత్రులతో ముందుకు సాగాలని నిర్ణయించింది. ఎట్టి పరిస్థితుల్లో అధికార పార్టీకి ధీటుగా నిలబడాలని చూస్తోంది. ఏ అవకాశాన్ని జారవిడుచుకోవడం లేదు.. ఇటువంటి పరిస్థితుల్లో ఆచితూచి వ్యవహరిస్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఏపీలో కూటమిపై విమర్శలు చేస్తుందే తప్ప.. కేంద్ర బిజెపిని పల్లెత్తు మాట అనడం లేదు. అయితే ఇప్పుడు తమిళనాడులో వైసిపి తీసుకున్న స్టాండ్ తో బిజెపి ఎలాంటి చర్యలకు దిగుతుందో చూడాలి. అయితే ఇప్పటివరకు కేంద్ర బిజెపి విషయంలో వైసీపీ సానుకూల నిర్ణయాలు తీసుకుంటూ వస్తోంది. లోక్సభ స్పీకర్ ఎంపిక నుంచి పార్లమెంట్లో ప్రవేశపెట్టి పలు బిల్లుల వరకు మద్దతు తెలిపింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అటువంటిది తమిళనాడులో డీఎంకే కూటమికి మద్దతు అంటే సాహసంతో కూడుకున్న పని. అయితే అది రోజా స్వయంగా తీసుకున్న నిర్ణయమా? పార్టీ తీసుకున్న నిర్ణయమా? అన్నది తెలియాల్సి ఉంది. ఒకవేళ రోజా సొంతంగా నిర్ణయం తీసుకుంటే మాత్రం వైసీపీని ఇరకాటంలో పెట్టినట్టే..

# అప్పలరాజుకు దూరమౌతున్న కేడర్



శ్రీకాకుళం, మార్చి 4,

మాజీమంత్రి సీదిరి అప్పలరాజుకు.. ఏపీ రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్ అని పేరు. 2019లో పలాస నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినా.. జగన్ కేబినెట్‌లో కీలక శాఖ దక్కించుకున్నారు. అప్పట్లో మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణలోనూ పదవి నిలబెట్టుకున్నారు. జగన్‌కి నమ్మినబంటులా ఉంటూ వస్తున్న ఆయన.. అధినేతపై ఎవరు విమర్శలు చేసినా.. వెంటనే కౌంటర్ ఎటాక్ చేస్తుంటారు. అలాంటి నాయకుడిపై ఇప్పుడు సొంత పార్టీలోనే ఇబ్బందులు ఎదురవతున్నాయా అనే ప్రచారం జరుగుతోంది. పార్టీలో లుకలుకలతో ఆయన సర్దుబాటు కావడం లేదట. అసమ్మతి నేతలు ఆయనకు మరింత తలపోటుగా మారారనే గుసగుసలు వినిపిస్తున్నాయ్.తన గెలుపులో కీలకంగా వ్యవహరించిన నేతలను.. సీదిరి పక్కన పెట్టారనే చర్చ ఎప్పటి నుంచో వినిపిస్తోంది. ఓ కోటరీని నమ్ముకొని.. దాని మధ్యలోనే ఉండిపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయ్. దువ్వాడ శ్రీకాంత్‌తో పాటు.. దువ్వాడ హేంబాబు చౌదరి, మాజీ మున్సిపల్ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు లాంటి సీనియర్ నేతలు.. వైసీపీని విడిచి వెళ్లిపోయింది కూడా సీదిరి తీరు నచ్చకే అనే చర్చ కూడా జరుగుతోంది. ఐతే ఈ ప్రభావం గత ఎన్నికల్లోనూ కనిపించింది. గత ఎన్నికల్లో గౌతు శిరీష చేతుల్లో భారీ పరాభవాన్ని మూటగట్టుకున్నారు సీదిరి. ఐతే ఓటమి తర్వాత కూడా ఆయనలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని.. పలాస నేతల్లో చర్చ జరుగుతోంది.రాష్ట్ర రాజకీయాలపై ఎప్పటికప్పుడు స్పందించే సీదిరి.. నియోజకవర్గంలో మాత్రం పార్టీని పట్టించుకోవడం లేదని.. తన చుట్టూ ఉన్న వారితోనే పార్టీని నడపాలని చూస్తున్నారని ఫ్యాన్ పార్టీ నేతల్లో ఆగ్రహం కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో వైసీపీలో కీలకంగా ఉన్న ప్రస్తుత మున్సిపల్ చైర్మన్ బల్లగిరిబాబు, మరో సీనియర్ నేత దువ్వాడ శ్రీధర్ కూడా తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ఇలా సీదిరి తీరు నచ్చక.. నేతలంతా ఒక్కొక్కరిగా దూరం అవుతున్నారనే గుసగుసలు పలాసలో జోరుగా వినిపిస్తున్నాయ్. పార్టీ కోసం కష్టపడే వారిని.. సీదిరి అప్పలరాజు కనీసం పట్టించుకోవడం లేదంటూ.. వైసీపీ కార్యకర్తలు బహిరంగంగానే విమర్శలు గుప్పించే పరిస్థితులు కనిపిస్తున్నాయనే టాక్ నడుస్తోంది.వైసీపీలో కీలక నేతగా ఉన్న దువ్వాడ శ్రీధర్.. సీదిరికి వ్యతిరేకంగా ఓ గ్రూప్ క్రియేట్ చేస్తున్నారు. పలాస ఉద్యమాన్ని ఎత్తుకున్నారు. పలాసను జిల్లా చేయాలంటూ జేఏసీ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇవన్నీ.. మాజీమంత్రి సీదిరి అప్పలరాజుకు తలపోటుగా మారాయనే చర్చ జరుగుతోంది. అటు పార్టీ అసలే కష్ట కాలంలో ఉంది. ఇలాంటి సమయంలో నేతలంతా ఒక్కొక్కరుగా దూరం అవుతుండడంతో.. కేడర్ కూడా డీలా పడిపోతోందట. సీదిరి దూకుడు రాజకీయాలతో.. అసలుకే మోసం వస్తుందని.. కార్యకర్తలు వాళ్లలో వాళ్లు చర్చించుకున్నారని తెలుస్తోంది. పార్టీలో గ్రూప్‌ల గోల ఎక్కువ అయితే.. ఎన్నికల నాటికి మరింత ఇబ్బంది అవుతుందని.. అందరిని కలుపుకొని వెళ్లినప్పుడే రాజకీయంగా గౌతు కుటుంబాన్ని ఢీకొట్టే అవకాశం ఉంటుందని.. ఫ్యాన్ పార్టీలో మరికొందరు నేతలు సూచిస్తున్నారు.

==============

# ఎమ్మెల్యే వర్సెస్ ఎంపీ



విజయవాడ, మార్చి 4, (

తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని చిన్నిల మధ్య మరోసారి రగడ మొదలయింది. దేవుడి ముందే చిల్లర తగవు పడటం మరింతగా ఇద్దరూ రాజకీయంగా దూరమయినట్లేనని చెబుతున్నారు. స్వామి వారికి సమర్పించే పట్టువస్త్రాలను అవమానించే విధంగా ప్రవర్తించారని ఇరు వర్గాలు ఆరోపించుకుంటున్నాయి. తిరువూరులో ఎమ్మెల్యే కొలికపూడి.. ఎంపీ కేశినేని చిన్ని మధ్య వివాదం రేగింది. గంపలగూడెంలోని నెమలి వేణుగోపాలస్వామి కళ్యాణం సందర్భంగా పట్టువస్త్రాలు ఎవరు సమర్పించాలనే విషయంలో వివాదం తలెత్తింది. ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం.. తోపులాటజరగడంతో పోలీసులు సర్ది చెప్పి పంపాల్సి వచ్చింది.ఎంపీ కేశినేని చిన్ని పట్టువస్త్రాలు సమర్పించడానికి ప్రయత్నించగా అతని తలపై ఉన్న వస్త్రాలను కొలికపూడి శ్రీనివాసరావు లాక్కున్నారు. ఇద్దరి వ్యవహారంపై అర్చకులు సహా భక్తుల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇరువురు నేతలు గౌరవమైన పదవులలో ఉండి ఆలయంలో ఇవేం చిల్లర వేషాలు అంటూ భక్తుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్వామి వారికి ఎవరో ఒకరు పట్టు వస్త్రాలు సమర్పించాలి కానీ, అక్కడ కూడా ఆధిపత్యం, రాజకీయాలు చేస్తే ఎలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి చిల్లర తగాదాలతో ఇద్దరూ ప్రజల్లో పలుచన అవుతున్నారన్న భావన వ్యక్తమవుతుంది. ఇరువురు ఒకేసారి ఆలయంలోకి రావడంతో ఈ పరిస్థితి తలెత్తింది. రెండు వర్గాలకు చెందిన నేతలు తోపులాటలు ఆలయంలో చోటు చేసుకోవడం దురదృష్టకరమని అంటున్నారు. రాజకీయ నాయకులటీడీపీ అధిష్టానానికి తలనొప్పిగా ఇద్దరి వ్యవహారం మారింది. గతంలో అనేక సార్లు వీరిద్దరి మధ్య వివాదానికి చెక్ పెట్టాలని ప్రయత్నం చేసినా ఫలితం కనిపించడం లేదు. చంద్రబాబు హెచ్చరించినా ఫలితం లేదు. చంద్రబాబు మాత్రం సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటామని చెబుతున్నారు. పార్టీ క్రమశిక్షణ కమిటీ కూడా వీరిద్దరి విషయంలో ఏమీ చేయలేక పోతుందని సొంత పార్టీ నుంచి కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇటీవల ఇరువురు నేతలు సోషల్ మీడియా వేదికగా రచ్చ చేసుకోవడంతో పార్టీ పరువు బజారున పడింది. ఇప్పుడు ఏకంగా ఆలయంలోనే ఘర్షణకు దిగడంతో ఇక తిరువూరు యుద్ధంలో ఏదో నిర్ణయం తీసుకోకపోతే పార్టీ వచ్చే ఎన్నికల్లో గెలిచే అవకాశాలు లేనట్లే కనిపిస్తున్నాయి.

# ఫర్నిచర్ దుకాణాల్లో అగ్ని ప్రమాదం

హైదరాబాద్: మార్చి 4,

బాచుపల్లి సమీపంలో ప్రగతినగర్ లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. రోడ్డు పక్కన ఫర్నిచర్ షాపులో మంటలు చెలరేగాయి. ఫుట్పాత్పై ఉన్న షాపుల్లో ఒక్కొక్కటిగా మంటలు అంటుకున్నాయి. 50 షాపులకు మంటలు వ్యాపించాయి. . మంటల్లో రూ. కోటి విలువైన ఫర్నిచర్ దగ్ధం అయినట్లు సమాచారం. పది ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపు చేసారు. సర్వం కోల్పోయామంటూ చిరు వ్యాపారుల రోదనలు మిన్నంటాయి.ప్రమాద సమయంలో భారీగా పొగలు కమ్మేయడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అయితే అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం లేదా గాయాలు జరగలేదు.

# జడల రామలింగేశ్వర ఆలయ ఉత్సవాల్లో అపశృతి

## అగ్నిగుండంలో పడి భక్తులకు గాయాలు

నల్గొండ మార్చి 4,

వేములపల్లి (మం) ఆమనగల్లు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఉత్సవాల్లో అపశృతి చోటు చేసుకుంది. అగ్నిగుండం దాటే క్రమంలో భక్తులు కింద పడ్డారు. దాంతో అక్కడ బందోబస్తులో వున్న పోలీసులు అప్రమత్తమైనిప్పుల్లో కింద పడ్డ భక్తులను బయటికి లాగివేసారు. ప్రమాదంలో నలుగురు భక్తులకు స్వల్పగాయాలు అయ్యాయి. భక్తులు ఒక్కసారిగా తీసుకుంటూ వచ్చే క్రమంలో ప్రమాదం తలెత్తింది.

=====================

# మియాపూర్ లో హత్య

మియాపూర్ పోగుల ఆగయ్య నగర్ లో అన్నదమ్ముల మధ్య జరిగిన ఘర్షణ దారుణ హత్యకు దారితీసింది. మద్యం మత్తులో ఉన్న తమ్ముడు, తన అన్నను బండరాయితో కొట్టి, కత్తితో పొడిచి హత్య చేసినట్లు స్థానికులు తెలిపారు. తరచుగా తాగి గొడవ చేస్తూ వేధిస్తున్నాడని హత్య చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కారు బావిలో పడి యువకుడు మృతి

నిర్మల్ మార్చి 4,

నిర్మల్ జి ల్లా ఖానాపూర్ మండలంలోని బీర్నంది గ్రామంలో మంగళవారం రాత్రి కారు అదుపుతప్పి బావిలో పడటంతో శ్రీనివాస్ (38) అనే యువకుడు మృతి చెందాడు. అత్యవసర పనిమీద రంగపేట్ వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళుండగా ఈ ప్రమాదం జరిగింది. కొమ్ముతండా సమీపంలో రహదారి పక్కనే ఉన్న బావిలో కారు దూసుకెళ్లింది. మృతుడు కదం మండలంలోని 'మన్ గ్రోమోర్' సంస్థలో మేనేజర్గా పనిచేస్తున్నట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

=====================

# ఫ్యామిలీ మ్యాన్ నుంచి పొలిటిషియన్...

చెన్నై, మార్చి4,

తమిళ స్టార్ హీరో, 'తమిళగ వెట్రి కళగం పార్టీ అధినేత దళపతి విజయ్ ప్రస్తుతం తన జీవితంలో అత్యంత క్లిష్టమైన దశను ఎదుర్కొంటున్నారు. ఒకవైపు రాజకీయాల్లోకి అడుగుపెట్టి 2026 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా దూసుకుపోతుంటే, మరోవైపు 26 ఏళ్ల వైవాహిక బంధం ముగింపు దశకు చేరుకోవడం ఆయన వ్యక్తిగత, రాజకీయ ప్రతిష్టపై తీవ్ర చర్చకు దారితీసింది.ఫిబ్రవరి 27న విజయ్ భార్య సంగీత స్వర్ణలింగం చెంగల్పట్టు ఫ్యామిలీ కోర్టులో విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేయడం కోలీవుడ్‌లో సంచలనం సృష్టించింది. 1999లో ప్రేమ వివాహం చేసుకున్న ఈ జంటకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే సంగీత తన పిటిషన్‌లో చేసిన ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. విజయ్ ఒక ప్రముఖ నటితో (త్రిష అని పుకార్లు వినిపిస్తున్నప్పటికీ పిటిషన్‌లో పేరు స్పష్టంగా లేదు) 2021 నుండి సంబంధం కలిగి ఉన్నారని సంగీత ఆరోపించారు. విజయ్ తనను సామాజికంగా, వృత్తిపరంగా దూరం పెట్టారని, ఆమె స్వేచ్ఛపై ఆర్థిక ఆంక్షలు విధించారని ఆమె ఆరోపించారు. సదరు నటి విజయ్‌తో దిగిన ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నా ఆయన ఖండించలేదని, ఇది తనను, పిల్లలను తీవ్ర అవమానానికి గురిచేసిందని ఆమె పేర్కొన్నారు.విజయ్ తన పార్టీ టీవీకేను స్థాపించి, సినిమాలకు స్వస్తి పలికి పూర్తిస్థాయి రాజకీయ నేతగా అవతరించాలని నిర్ణయించుకున్నారు. సరిగ్గా 2026 అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ విడాకుల వ్యవహారం బయటకు రావడం ఆయనకు రాజకీయంగా పెద్ద దెబ్బ. విజయ్ ఇప్పటివరకు ఒక 'ఫ్యామిలీ మ్యాన్'గా, బాధ్యతాయుతమైన వ్యక్తిగా తన ఇమేజ్‌ను కాపాడుకుంటూ వచ్చారు. విడాకుల పిటిషన్‌లో నైతికతకు సంబంధించిన ఆరోపణలు రావడంతో ప్రత్యర్థి పార్టీలకు ఇది ఒక ఆయుధంగా మారే అవకాశం ఉంది. రాజకీయాల్లో మహిళా ఓటర్ల మద్దతు చాలా ముఖ్యం. భార్యను నిర్లక్ష్యం చేశారనే ఆరోపణలు మహిళా ఓటర్లలో ఆయనపై ప్రతికూల అభిప్రాయాన్ని కలిగించవచ్చు.రాజకీయాలతో పాటు సినిమా పరంగా కూడా విజయ్ ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ఆయన చివరి చిత్రంగా భావిస్తున్న 'జన నాయకన్' సెన్సార్ పరంగా ఆటంకాలను ఎదుర్కొంటోంది. రాజకీయ సందేశాలు ఉండటంతో సెన్సార్ బోర్డు అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. పొంగల్ కు విడుదల కావాల్సిన ఈ సినిమా ఇప్పటివరకూ రిలీజ్ కాలేదు. అటు వ్యక్తిగత జీవితం, ఇటు కెరీర్ రెండూ డైలమాలో పడ్డాయి.తమిళనాడు రాజకీయాల్లో వ్యక్తిగత జీవితంపై విమర్శలు రావడం కొత్తేమీ కాదు. గతంలో ఎంజీఆర్, జయలలిత, కరుణానిధి వంటి నేతలు కూడా ఇలాంటి వ్యక్తిగత విమర్శలను ఎదుర్కొన్నారు. అయితే విజయ్ ఇప్పుడు ఏ పరిస్థితుల్లో ఉన్నారనేది ముఖ్యం. విజయ్ అభిమానులు, యువత దీన్ని ఆయన వ్యక్తిగత విషయంగా చూస్తున్నారు. రాజకీయాల్లో ఆయన సిద్ధాంతాలకు, ఈ వివాదానికి సంబంధం లేదని వారు వాదిస్తున్నారు. ఈ వివాదంపై విజయ్ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. ఏప్రిల్ 20న కోర్టు విచారణకు హాజరుకావాల్సి ఉంది. ఈలోగా ఆయన ఈ సమస్యను ఎలా పరిష్కరించుకుంటారు లేదా ప్రజలకు ఎలా సంజాయిషీ ఇస్తారనే దానిపైనే ఆయన రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.విజయ్ తన జీవితంలో అత్యంత కఠినమైన 'అగ్నిపరీక్ష'ను ఎదుర్కొంటున్నారు. ఒకవైపు దశాబ్దాల వైవాహిక జీవితం విచ్ఛిన్నం కావడం, మరోవైపు రాజకీయాల్లో స్థిరపడాలనే లక్ష్యం.. ఈ రెండింటి మధ్య ఆయన ప్రయాణం ఆసక్తికరంగా మారింది. ఈ సంక్షోభం నుండి ఆయన ఎలా గట్టెక్కుతారో కాలమే నిర్ణయించాలి. రాజకీయాల్లో నెగ్గాలంటే కేవలం సినిమా పాపులారిటీ సరిపోదని, వ్యక్తిగత ప్రవర్తన కూడా క్లీన్‌గా ఉండాలని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

===================

# యుద్ధం ఖర్చు రోజుకు 7 వేల కోట్లు

న్యూయార్క్, మార్చి4,

అమెరికా?ఇరాన్ ఘర్షణలు పశ్చిమాసియాలో యుద్ధ ఆందోళనలను పెంచుతున్నాయి. ఫిబ్రవరి 28న మొదలైన యుద్ధం.. మార్చి 3వ తేదీనాటికి తీవ్రరూపం దాల్చింది. ఇరాన్ సుప్రీం లీడర్ మరణించినా ఇరాన్ పోరాటంలో వెనక్కు తగ్గడం లేదు. ప్రతీకార దాడులు ఉధృతం చేసింది. దీంతో ఈ యుద్ధం నాలుగు వారాలు కొనసాగే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ప్రకటించారు.ఫిబ్రవరి 28, 2026న అమెరికా పరేషన్ ఎపిక్ ఫ్యూరీ పేరుతో అమెరికా ఇరాన్‌పై యుద్ధం ప్రకటించింది.



ఇక ఇజ్రాయెల్ ఆపరేషన్ లయన్ రోర్ పేరుతో ఇరాన్ లక్ష్యాలపై గగన, భూ, సముద్ర దాడులు చేసింది. ఇరాన్‌కు చెందిన 11 నౌకలు ధ్వంసమయ్యాయి. ఇరాన్ అణు కార్యకలాపాలను ఆపమని ట్రంప్ హెచ్చరించగా, ఇరాన్ గల్ఫ్ దేశాలు, ఇజ్రాయెల్ స్థావరాలపై ప్రతీకార దాడులు చేసింది.అమెరికా 20కి పైగా ఆయుధ వ్యవస్థలు ఉపయోగిస్తోంది, యుఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ వంటి వాహక నౌకలు మోహరించింది. ఇరాన్ హెజ్‌బొల్లా, ఇరాక్ మిలీషియాతో కలిసి డ్రోన్, క్షిపణి దాడులు చేస్తోంది. అమెరికా వైపు 6 మంది సైనికులు మరణించారు, మూడు విమానాలు కూలాయి.యుద్ధం ప్రారంభించి5న తొలి 24 గంటల్లో అమెరికా 779 మిలియన్ డాలర్లు (సుమారు రూ.7 వేల కోట్లు) ఖర్చు చేసింది. ముందస్తు యుద్ధ నౌకల మోహరింపునకు మరో 630 మిలియన్ డాలర్లు అంటే రోజుకు 6.5 మిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. ఇజ్రాయెల్ మద్దతుకు 21.7 బిలియన్, ఇతర ఆపరేషన్లకు 9?12 బిలియన్ డాలర్లు వెచ్చించింది. మొత్తం 31?33 బిలియన్ డాలర్లు ఖర్చు చేసిందిట్రంప్ నాలుగైదు వారాలు యుద్ధం కనొసాగుతుందని ప్రకటించారు. అవసరమైతే భూదాడులు చేస్తామని ప్రకటించారు. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ అమెరికాకు మద్దతు ప్రకటించాయి. అయితే అమెరికా వద్ద క్షిపణి రక్షణ వ్యవస్థలు పరిమితం, ఉక్రెయిన్, ఆసియాకు పంపించారు. యుద్ధం సుదీర్ఘంగా కొనసాగితే నష్టాలు పెరిగి రక్షణ బడ్జెట్ 1.5 ట్రిలియన్ డాలర్లకు పెరగవచ్చు.ఆయుధ నష్టాలు, సాంకేతిక లోపాలు ఆందోళనకరం. ఇరాన్ సైప్రస్, గల్ఫ్ లక్ష్యాలపై దాడులు పెంచుతోంది. జెనీవాలో పరోక్ష చర్చలు జరుగుతున్నా, యుద్ధం అనివార్యమని ట్రంప్ హెచ్చరిస్తున్నారు.

దీర్ఘకాలం కొనసాగే అవకాశం

అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్ పెట్టిన అణుచిచ్చు.. నాలుగు రోజులుగా గల్ఫ్ దేశాలను దహించి వేస్తోంది. మొన్నటి వరకు కలిసి ఉన్న దేశాలు ఇప్పుడు పరస్పర దాడులతో ఆందోళన చెందుతున్నాయి. ఇరాన్ అణు కార్యక్రమాలు ఆపాలని డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'తో ఇరాన్ సుప్రీం లీడర్ హయతుల్లా ఖమేనీ మరణించాడు. దీంతో ఇరాన్ ప్రతిదాడులు చేస్తోంది. గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలు, ఇజ్రాయెల్‌ను టార్గెట్ చేసింది. దీంతో అమెరికా అప్రమత్తమైంది. ఈ యుద్ధం ఇప్పడే ముగియదని మరో నాలుగు నుంచి ఐదు వారాలు కొనసాగుతుందని ట్రంప్ ప్రకటించారు. ఇరాన్ అణ్వాయుధాల తయారీని ఆపకపోవటం, అమెరికా ఆస్తులను లక్ష్యంగా చేసుకునే సామర్థ్యం గల క్షిపణులను కలిగి ఉంచటంతో ఈ దాడులు తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. మునుపటి హెచ్చరికలను ఇరాన్ నిర్లక్ష్యం చేసినందుకు దాని మిసైల్ వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేయడమే ప్రధాన లక్ష్యమని ట్రంప్ హెచ్చరించారు.ఇరాన్ అణ్వాయుధాల కార్యక్రమాన్ని పూర్తిగా అంగీకరించడం లేదని, దాని కొనసాగడం ప్రపంచ భద్రతకు తీవ్ర ముప్పుగా మారుతోందని ట్రంప్ వాదించారు. ఇరాన్ దగ్గర అమెరికా స్థావరాలు, ఆర్థిక మూలాలపై దాడి చేసే దీర్ఘ పరిధి క్షిపణులు ఉన్నాయని, వాటిని నాశనం చేయడమే ఈ ఆపరేషన్ ఉద్దేశమని చెప్పారు. ఇరాన్‌కు ఇచ్చిన మునుపటి హెచ్చరికలను బేఖాతరుగా పట్టించుకోవడం ఈ దీర్ఘకాల దాడులకు కారణమని ఆయన స్పష్టం చేశారు.ప్రస్తుత దాడులు మరో నాలుగు నుంచి ఐదు వారాలు పరిమితి లేకుండా సాగుతాయని అమెరికా రక్షణ మంత్రి కూడా ప్రకటించారు. ఇప్పటికే ఇరాన్‌లో 200 మంది మరణించినా, ఇరాన్ రిపబ్లిక్ గార్డ్ కార్ప్స్(ఐఆర్‌జీసీ), మిలిటరీ దళాలు ఆయుధాలు వదలితే క్షమించి వదిలేస్తామని ట్రంప్ పిలుపునిచ్చారు. లేకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని, దౌత్య మార్గాలు తెరిచే ఉన్నా సైనిక చర్యలు ప్రధానమని చెప్పారు. అమెరికా సైనికుల్లో కొందరు మరణించినా యుద్ధం ముందుకే సాగుతుందని ఆయన ధైర్యంగా ప్రకటించారు.ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ, మాజీ ప్రధాని మరణాల తర్వాత అమెరికా?ఇజ్రాయెల్ సంయుక్త దాడులు బాలిస్టిక్ మిసైల్ కేంద్రాలు, అణు స్థావరాలపై బిట్ స్టెల్త్ బాంబర్లతో జరుగుతున్నాయి. ఇరాన్ ప్రతిదాడులు యూఏఈ, ఖతార్‌లోని అమెరికా బేస్‌లపై కురిపించగా, మూగ్గురు అమెరికన్ సైనికులు మరణించారు. ఈ ఆపరేషన్ ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని పూర్తిగా బలహీనపరచడానికి రూపొందించబడిందని అమెరికా సెంట్రల్ కమాండ్ పేర్కొంది.ఇరాన్ అణు కార్యక్రమం ప్రపంచ భద్రతకు హెచ్చరిక సంకేతాలు ఇస్తోందని ట్రంప్ వాదనలు సూచిస్తున్నాయి. మిసైల్ వ్యవస్థ ధ్వంసం ద్వారా ఇరాన్ ప్రాంతీయ ఆధిపత్యాన్ని అరికట్టాలనే ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోంది. దీర్ఘకాల దాడులు మధ్యప్రాచ్య ఆర్థిక వ్యవస్థలు, చమురు ధరలను ప్రభావితం చేస్తాయి. ఓమాన్ మధ్యవర్తిత్వంతో జెనీవాలో జరిగే చర్చలు సఫలమైతే యుద్ధం ఆగే అవకాశం ఉంది. మరోవైపు రష్యా, చైనా దాడులను వెంటనే ఆపమని పిలుపునిచ్చాయి. యూరోపియన్ యూనియన్ శాంతి చర్చలకు మద్దతు తెలపడంతోపాటు అణు అంబాగోచా భయం వ్యక్తం చేసింది.

# ఆర్థిక పరిస్థితి... ఏంటీ

హైదరాబాద్, మార్చి 4, (

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక స్థితిపై కేంద్రానికి డౌట్ వచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి ఖజానా నిల్ అనడంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గట్టిగానే సవాళ్లు చేశారు. కేంద్రం నిధులు ఇస్తున్న రాష్ట్ర ఖజానా ఖాళీ అంటున్న రేవంత్ రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక స్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాయడం సంచలనమైంది. దీంతో నిజంగానే తెలంగాణ రాష్ట్ర ఖజానా నిల్ అయ్యిందా? అయితే రాహుల్ గాంధీకి 1000 కోట్లు ఇస్తానన్న రేవంత్ రెడ్డి వాటిని ఎలా చెల్లిస్తారన్న కిషన్ రెడ్డి మాట ఇప్పుడు వైరల్ గా మారింది.రాష్ట్ర ఖజానా 'నిల్' అంటూ రాజకీయ వేదికలపై వినిపిస్తున్న మాటలు ఇప్పుడు కొత్త కామెడీ ట్రాక్‌లా మారాయి. ఎన్నికల సమయంలో ఖజానా "ఫుల్"గా కనిపిస్తుంది. హామీల జాబితా చూస్తే అది మినీ బడ్జెట్ కాదు, మేగా బడ్జెట్ అన్నట్టు ఉంటుంది. కానీ అధికారంలోకి వచ్చాక అదే ఖజానా ఒక్కసారిగా "ఖాళీ మట్టి కుండ"గా మారిపోతుంది. ఇది ఆర్థిక శాస్త్రంలోని కొత్త సిద్ధాంతమా? లేక రాజకీయ శాస్త్రంలోని పాత మంత్రామా?ఎన్నికల ముందు "ఆరు గ్యారెంటీలు ? 420 హామీలు" అంటూ ప్రజలకు కలల కట్టడాలు చూపిస్తారు. ఓట్లు పడిన తర్వాత మాత్రం "ఖజానాలో లంకెబిందెలు లేవు" అని చెబుతారు. అయితే ఇదే సమయంలో మరో సభలో "అవసరమైతే వెయ్యి కోట్లు ఇస్తాం" అనే ధైర్యవాక్యాలు వినిపిస్తే? ప్రజలు ఏది నమ్మాలి? ఖజానా ఖాళీనా? లేక డైలాగ్‌లే ఫుల్‌గా ఉన్నాయా?ఇది చూసి ప్రజలకు ఒక సందేహం రావడం సహజం.. ఖజానా 'నిల్' అయితే మాటల ఖజానా మాత్రం 'అన్‌లిమిటెడ్' ఎలా? రాజకీయాల్లో ఇది కొత్త గణితం కావచ్చు. 0 + 1000 = సభలో చప్పట్లు అన్న ఫార్ములా!ఇంకో ఆసక్తికర విషయం ఏమిటంటే? కేంద్రం నుంచి వచ్చిన నిధులు, రాష్ట్ర అప్పులు, బడ్జెట్ లెక్కలు.. ఇవన్నీ ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలంటే శ్వేతపత్రం అవసరం అంటున్నారు. కానీ రాజకీయాల్లో శ్వేతపత్రం అంటే వాస్తవాల పుస్తకం కాదు, వాదాల పుస్తకంగా మారిపోతుంది. ఒక పార్టీ విడుదల చేస్తే అది "నిజాల గ్రంథం"; మరో పార్టీకి అది "అబద్ధాల సంకలనం".ఇక అప్పుల కథ కూడా సినిమాలా ఉంది. ఎవరు అధికారంలో ఉన్నా అప్పులు మాత్రం హీరోల్లా సీన్‌లో ఉంటాయి. "మేము తీసుకున్న అప్పులు అభివృద్ధి కోసం" అంటారు. "వాళు తీసుకున్న అప్పులు దుర్వినియోగం" అంటారు. చివరకు ప్రజలకు మాత్రం ఈఎంఐలే మిగులుతాయి.. పన్నుల రూపంలో.మొత్తానికి "రాష్ట్ర ఖజానా నిల్" అన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట కంటే "రాజకీయ నాటకం ఫుల్" అన్న మాట దగ్గరగా ఉందేమో అనిపిస్తోంది. ప్రజలు ఇప్పుడు ఒకే ప్రశ్న అడుగుతున్నారు. ఖజానా నిజంగానే ఖాళీనా? రేవంత్ రెడ్డి గారు? లేక రాజకీయ సంభాషణలే ఖాళీగా ఉన్నాయా?సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై ఓ శ్వేతపత్రం వస్తే బాగానే ఉంటుంది. ఎంతసేపు కేసీఆర్ ఖజానా ఖాళీ చేశాడనే బదులు.. మీరు అధికారంలోకి వచ్చాక ఏం చేశారన్నదే జనాలు చూస్తారు. అందుకే కేసీఆర్ ను కాదని మీకు ఓటు వేశారు. ఎందుకంటే సంఖ్యలు మాట్లాడితే వాదాలు తగ్గుతాయి. లెక్కలు బయటపెడితే నిజం బయటపడుతుంది. అప్పటివరకు మాత్రం సభల స్టేజీలపై ఖజానా 'నిల్' చప్పట్లు 'ఫుల్' అనే ట్రెండ్ కొనసాగుతుందేమో!

# హైదరాబాద్ లో ఖమేనీ రోడ్

హైదరాబాద్, మార్చి 4, (న్యూస్ పల్స్)

ఇప్పుడు ఎక్కడ చూసినా, ఎక్కడ విన్నా యుద్ధం గురించే చర్చ. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా యుద్ధ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు ఉద్ధృతమవుతున్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో ఒక పేరు మాత్రం పెను సంచలనం సృష్టిస్తోంది. అదే ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ పేరు. ఇటీవలి దాడుల్లో ఖమేనీ మృతి చెందడంతో యుద్ధం మరింత తారాస్థాయికి చేరుకుంది. ఇక్కడ మరింత ఆశ్చర్యపోయే విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఖమేనీ పేరు మీద హైదరాబాద్ మహా నగరంలో ఏకంగా ఓ రోడ్డే ఉందట. ఏంటి.. వినడానికి చాలా వింతగా ఉంది కదూ..!ఇరాన్ దాడుల నేపథ్యంలో అల్లకల్లోలమైన ప్రపంచ దేశాలను ఇప్పుడీ విషయం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. భాగ్యనగరంలో 'ఖమేనీ' రోడ్డు ఉందన్న విషయం తాజా దాడుల నేపథ్యంలో కొత్తగా బయటికి వచ్చింది. అయతొల్లా అలీ ఖమేనీ మరణ వార్త ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తుండగా.. మరోవైపు, హైదరాబాద్ నగరంలో ఖమేనీ పేరుతో ఒక రోడ్డు ఉందన్న విషయం సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీసింది. అది కూడా నగరంలోనే ప్రముఖంగా వినిపించే బంజారాహిల్స్‌లో ఈ పేరుతో రోడ్డు ఉండటం విశేషం. ఇక్కడే మరో ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. అయతొల్లా అలీ ఖమేనీ పేరు మీద నగరంలో రోడ్డు ఉందన్న విషయం వైరల్ అవుతున్న నేపథ్యంలో ప్రస్తుతం మరణించిన నేత పేరుతో కాకుండా ఇరాన్ తొలి సుప్రీం లీడర్ జ్ఞాపకార్థమే ఈ రోడ్డుకు ఈ పేరు పెట్టారని అసలు విషయం బయటపడింది. ఈ విషయం మాకు ఇప్పటివరకూ తెలియదని, ఖమేనీ మరణం తర్వాతే ఇలాంటి ఆశ్చర్యం కలిగించే కొత్త విషయాలు బయటికి వస్తున్నాయని నెటిజన్లు అంటున్నారు.హైదరాబాద్ నగరంలో ఈ రోడ్డు ఎక్కడ ఉందనే కదా ఇప్పుడు మీ అనుమానం..! జీవీకే వన్ మాల్ ఎదురుగా ఉండే బంజారాహిల్స్ రోడ్డు నెం.7ని అధికారికంగా 'ఇమామ్ ఖమేనీ రోడ్' అని పిలుస్తారు. ఇదే ప్రాంతంలో ఇరాన్ కాన్సులేట్ కార్యాలయం ఉండటంతో అప్పటి మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ ఈ రోడ్డుకు ఈ పేరును పెట్టినట్లు సమాచారం. కుతుబ్ షాహీల కాలం నుంచి హైదరాబాద్, ఇరాన్ దేశాల మధ్య ఉన్న దృఢమైన సాంస్కృతిక, వాణిజ్య సంబంధాలకు గుర్తుగా అప్పటి అధికారులు ఈ నిర్ణయం తీసుకోవడమే కాకుండా అప్పటి ప్రభుత్వం ఈ పేరును అధికారికంగా రికార్డుల్లో కూడా చేర్చింది.ఇరాన్ మొదటి సుప్రీం లీడర్ రుహుల్లా ఖమేనీ పూర్వీకులకు మన దేశంతో విడదీయలేని సంబంధాలు ఉండేవి. ఖమేనీ తాతలు ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకి జిల్లాకు చెందిన కింతూరులో పుట్టారని చరిత్రకారులు చెబుతున్న మాట. 19వ శతాబ్దంలోనే ఖమేనీ పూర్వీకులు ఇరాన్‌కు వలస వెళ్లి అక్కడే రాజకీయాల్లో కీలక పాత్ర పోషించడంతో ఈ సంబంధం ఇలా కొనసాగింది. అయితే.. తాజా దాడుల ఘటనలో అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మృతి చెందాడు. డౌన్‌టౌన్‌లోని ఖమేనీ కాంపౌండ్ లక్ష్యంగా ఫిబ్రవరి 28న ఖమేనీతో పాటు ఆయన కుమార్తె, అల్లుడు, కోడలు, మనవరాలు ప్రాణాలు కోల్పోయారు. ఖమేనీ ఇరాన్ మరింత అట్టుడికిపోయింది. తమ దేశంపై దాడి చేసిన ఇజ్రాయెల్, అమెరికాలను వదిలే ప్రసక్తే లేదని ప్రకటన కూడా విడుదల చేసింది. ఈ క్రమంలో శత్రుదేశాల మధ్య పోరు మరింత తీవ్ర రూపం దాల్చింది. ఇదంతా ఇలా ఉండగా.. ఖమేనీ మరణం తర్వాత హైదరాబాద్ నగరంలో ఓ రోడ్డు ఉందనే విషయాన్ని ఓ నెటిజన్ తన ఫేస్‌బుక్ పేజీ ద్వారా వెల్లడించడంతో ఇక టి నుంచి సోషల్ మీడియాలో ఈ వార్త తెగ వైరల్ అవుతోంది.

# మూడు నెలల్లో మూడు దేశాలపై దాడులు..

న్యూయార్క్, మార్చి4

అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్.. 2026లో నెలకొకరనిని టార్గెట్ చేస్తున్నాడు. ఏడాది పాలన పూర్తి కావడంతో తనలోని యుద్ధ కాంక్షను బయటపెట్టిన ట్రంప్ అమెరికా ప్రయోజనాల కోసం యుద్ధం చేస్తున్నాడు. యుద్ధాలు ఆపుతానని గద్దెనెక్కిన నేత.. జరుగుతున్న యుద్ధాలు ఆపకుండా.. కొత్త యుద్ధాలు మొదలు పెట్టాడు. జనవరి నుంచి మార్చి 1 వరకు ముగ్గురిని టార్గెట్ చేశాడు. వెనిజుల్లా అధ్యక్షుడు నికోలస్ మదురోను ట్రంప్ ఈ ఏడాది జనవరిలో టార్గెట్ చేశాడు. వెనెజువెలాలోని ఆయిల్ నిల్వల కోసం ఆ దేశ అధినేతను సైలెంట్‌గా కిడ్నాప్ చేయించాడు. ఇక తమ దేశంలోకి డ్రగ్స్ అక్రమంగా సరఫరా చేస్తున్నాడని మెక్సికోకు చెందిన లార్డ్ ఎల్ మెంచోను ట్రాప్ చేసి ఫిబ్రవరిలో హతమార్చాడు. ప్రియురాలును ట్రాప్ చేసి మెంచోను హతమార్చారు. ఇక తాజాగా ఇరాన్ టాప్ లీడర్ ఖమేనీని మట్టుబెట్టాడు. అణ్వాయుధాలు తయారు చేస్తున్నాడన్న సాకుతో ఇజ్రాయెల్‌తో కలిసి దాడులు చేశాడు. చివరకు హతమార్చాడు.ఈ టార్గెట్లు రాజకీయ, డ్రగ్స్, మతపరమైన తీవ్రవాదానికి చిహ్నాలు. అమెరికా ఇప్పుడు 'హిట్ లిస్ట్' రక్షణ, వాణిజ్య ఆధారాలు, మానవ హక్కుల ఉల్లంఘనలపై దృష్టి పెడుతోంది. ఈ వ్యూహం ద్వారా వాసింగ్టన్ తన ప్రభావాన్ని పునరుద్ధరిస్తూ, ప్రత్యర్థులకు హెచ్చరికలు జారుస్తోంది.ఇక ట్రంప్ తర్వాతి లక్ష్యం ఉత్తర కొరియా అని విశ్లేషకులు భావిస్తున్నారు. కిమ్ అణు కార్యకలాపాలు, మిస్సైల్ పరీక్షల కారణంగా దాడి చేసే అవకాశం ఉంది. ఉక్రెయిన్, రష్యా యుద్ధం నేపథ్యంలో రష్యాపైనా దాడికి అవకాశాలు లేకపోలేదని భావిస్తున్నారు. రష్యాపై సైబర్ దాడులకు ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇక తర్వాతి లక్ష్యం చైనా. చైనా ? తైవాన్ ఉద్రిక్తతలు, దక్షిణ చైన సముద్రం వివాదాలు లక్ష్యంగా మారవచ్చు. మధ్యప్రాచ్యంలో హమాస్, హిజ్బుల్లా సంబంధాలు కొత్త టార్గెట్లకు దారి తీస్తాయి.అమెరికా దుందుడుకు చర్యలతో మిత్రరాజ్యాలకు ఇబ్బందులు లేకపోయినా.. ప్రత్యర్థులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి విమర్శలు, వాణిజ్య యుద్ధాలు పెరిగే ప్రమాదం ఉంది. అమెరికా ఈ మార్గంలో స్వయం రక్షణను సాకుగా చూపుతోంది.

# మార్చురీలో పీక్కుతున్న మృతదేహాలు

మహబూబ్ నగర్, మార్చి 4,

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో చోటుచేసుకున్న అమానవీయ ఘటనపై ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. మార్చురీలో భద్రపరిచిన ఒక వ్యక్తి మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్నాయన్న వార్తపై ప్రభుత్వం వెంటనే స్పందించింది.ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశార. ఆయన ఆదేశాల అనంతరం.. మంగళవారం రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ స్వయంగా జడ్చర్ల ఆసుపత్రిని సందర్శించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. మార్చురీ నిర్వహణలో దారుణమైన వైఫల్యం , విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్లు తేలడంతో నలుగురిపై సస్పెన్షన్ వేటు వేశారు. సస్పెండ్ అయిన వారిలో ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రకళ, ఆర్ఎంవో హరినాథ్, డ్యూటీ డాక్టర్ , ఎంఎస్వో ఉన్నారు.మార్చురీ వంటి సున్నితమైన ప్రదేశాలలో కనీస రక్షణ కరువవడం, కుక్కలు లోపలికి వెళ్లి మృతదేహాన్ని పీక్కుతినే వరకు సిబ్బంది గుర్తించకపోవడంపై ప్రజల నుండి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి.

# గల్ఫ్ దేశాల్లో 15 లక్షల మంది తెలంగాణ వాసులు..

హైదరాబాద్, మార్చి 4,

ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా దాడులు.. వీటికి ప్రతీకారంగా గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేస్తున్న ప్రతీకార దాడులతో మిడిల్ ఈస్ట్‌లో తీవ్ర యుద్ధ వాతావరణం నెలకొంది. సుప్రీం లీడర్ ఖమేనీని హతమార్చిన తర్వాత ఇజ్రాయెల్, అమెరికా బెదిరింపులకు ఇరాన్ ఏమాత్రం లొంగడం లేదు. దీంతో పరిస్థితి మరింత దారుణంగా తయారయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే గల్ఫ్ దేశాల్లో ఉన్న తమ వారు ఎలా ఉన్నారోనని రాష్ట్రంలోని వారి కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.తెలంగాణ నుంచి లక్షలాది మంది జనం ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి పనిచేస్తున్నారు. ఇక్కడ చేయడానికి పనుల్లేక, చేసిన పనులకు సరైన డబ్బులు రాకపోవడంతో.. విదేశాలకు వెళ్లి కష్టపడితే ఎక్కువ డబ్బులు వస్తాయనే ఆశతో చాలా మంది వెళ్తున్నారు. అక్కడికి వెళ్లిన వారు బాగా సంపాదిస్తుండటంతో ఫ్రెండ్స్, కుటుంబ సభ్యులు, తెలిసిన వాళు కూడా ఆయా దేశాలకు వెళ్లి డబ్బులు సంపాదిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇరాన్, ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, యూఏఈ, బహ్రెయిన్, ఒమన్, ఖతార్, కువైట్ వంటి దేశాల్లో భారీ సంఖ్యలో భారత్ నుంచి వెళ్లిన వాళ్లు ఉన్నారు. అందులో ఒక్క తెలంగాణ నుంచే దాదాపు 15 లక్షల మంది ప్రజలు ఈ గల్ఫ్ దేశాల్లో రకరకాల పనులు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంతో అక్కడ ఉన్న తెలంగాణ వాసుల పరిస్థితి ఏంటి అనేది ప్రశ్నార్థకంగా మారింది.అమెరికా, ఇజ్రాయిల్ కలిసి ఇరాన్‌పై యుద్ధం ప్రకటించగా.. ఈ దాడులు మొత్తం గల్ఫ్ దేశాలకు అంటున్నాయి. దీంతో ఆయా దేశాల్లో ఉన్న తెలుగువారి భద్రతపై తెలుగు రాష్ట్రాల్లోని కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇక తెలంగాణ నుంచి గల్ఫ్ దేశాల్లో 15 లక్షల మంది తెలంగాణవాసులు ఉండగా.. అందులో 9 లక్షల మంది ఉత్తర తెలంగాణకు చెందినవారే ఉండడం గమనార్హం. ఇక సౌదీ అరేబియా, దుబాయ్, షార్జా, అబుదాబీ, ఒమన్, ఖతార్, బహ్రెయిన్, కువైట్ దేశాల్లో మొత్తంగా 90 లక్షల మంది భారతీయులు ఉండగా.. అందులో 15 లక్షల మంది తెలంగాణ, మరో 15 లక్షల మంది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఉన్నారని ప్రభుత్వం అంచనా వేస్తోంది.ఇక ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి 2.5 లక్షల మంది.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి మరో 2 లక్షల మంది.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 1.5 లక్షల మంది గల్ఫ్ దేశాలకు వలస వెళ్లి జీవిస్తున్నారు. ఇక సిద్దిపేట జిల్లాకు చెందిన 15 వేల మంది పలు రకాల పనులు చేస్తున్నారు. ఒక్క ఇజ్రాయెల్‌లోనే నిజామాబాద్ జిల్లా నుంచి 700 మంది పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన వారు యూఏఈ, ఒమన్ వంటి దేశాల్లో కార్మికులుగా పనిచేస్తున్నారు.ఇజ్రాయెల్, అమెరికా దేశాలపై కోపంతో.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ సైన్యం క్షిపణి, డ్రోన్‌లతో విరుచుకుపడుతోంది. దీంతో ప్రస్తుతం గల్ఫ్ దేశాల్లోని చాలా కంపెనీల్లో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ క్రమంలోనే గత రెండు రోజులుగా వలస కార్మికులు మొత్తం బంకర్లలోనే తలదాచుకుంటున్నారు. నిత్యం సాయంత్రం 4 గంటల నుంచి ఉదయం వరకు బాంబుల శబ్దాలు దద్దరిల్లిపోతున్నాయని.. బంకర్లలో దాక్కొని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నట్లు అక్కడి ఉన్నవారు తమ కుటుంబ సభ్యులకు చెబుతున్నారు. వారు అక్కడ క్షేమంగానే ఉన్నట్లు చెప్పినా.. ఇక్కడ ఉన్న వారు మాత్రం భయం గుప్పిట్లోనే జీవిస్తున్నారు.మరోవైపు.. ఇప్పటికే గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న వారి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది. అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దని వారికి సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఇక మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు వలస కార్మికుల కుటుంబ సభ్యులు, బంధువులతో మాట్లాడి వారికి ధైర్యం చెబుతున్నారు. ప్రభుత్వం తరఫున చేయాల్సిన సాయాన్ని చేస్తామని హామీ ఇచ్చారు. గల్ఫ్ దేశాల్లో ఉన్నవారిని రక్షించేందుకు అన్ని చర్యలు చేపడతామని కేంద్రమంత్రి బండి సంజయ్ కూడా వెల్లడించారు.మరోవైపు.. గల్ఫ్ కార్మికుల సమాచారం తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎమర్జెన్సీ టోల్‌ఫ్రీ నంబర్లను అందుబాటులోకి తెచ్చింది. అబుదాబీ (యూఏఈ) టోల్‌ఫ్రీ నంబర్ 800-46342.. వాట్సాప్ +971543 090571.. కువైట్ +96565 501946.. బహ్రెయిన్ 00973-39418071.. మస్కట్ (ఒమన్) 800 71 234.. జోర్డాన్ 00962 770422 276.. బాగ్దాద్ (ఇరాక్) +964 771 651 1185.. టెహ్రాన్ (ఇరాన్) +9891 281 09115.. సౌదీ అరేబియా 00 966 114 884 697.. దోహా (ఖతార్) 00974 5564 7502.. పాలస్తీనా +970 592916418 నంబర్లకు సంప్రదించి తమ వారి క్షేమ సమాచారం తెలుసుకోవచ్చని సూచించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య.. గల్ఫ్ కార్మికుల కోసం కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. కార్మికులు 87126 59700, 87126 59821 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

తలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పశ్చిమాసియాలో ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో తెలంగాణ ప్రభుత్వం కంట్రోల్ రూంను ఏర్పాటు చేసింది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో తెలంగాణ ప్రజల భద్రత కోసం దీన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. విదేశాంగ శాఖతో పాటు ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలతో తెలంగాణ భవన్ అధికారులు ఎప్పటికప్పుడు సంప్రదింపులు చేస్తున్నారు. విదేశాల్లోని తెలంగాణవారికి ఇబ్బందులు, ప్రయాణ అంతరాయాలు, ఎమర్జెన్సీ ఎదురైతే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని తెలిపారు. 24 గంటల పాటు 9871999044, 58322143, 991014749, 9643723157 నంబర్లను అందుబాటులో ఉంచారు.

# రంగంలోకి నాగబాబు...

హైదరాబాద్, మార్చి4,



మెగా బ్రదర్ నాగబాబు త్వరలో మంత్రి కానున్నారు. ఇప్పటికే ఆయనను మంత్రివర్గంలోకి తీసుకుంటామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అందులో భాగంగా గత ఏడాది ఆయన ఎమ్మెల్సీ అయ్యారు. అయితే ఆయన అనుకున్న స్థాయిలో వాయిస్ వినిపించడం లేదని.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఎందుకు ఎదుర్కోలేకపోతున్నారని స్వయంగా పవన్ కళ్యాణ్ ప్రశ్నించేసరికి నాగబాబు అప్రమత్తమయ్యారు. అప్పటినుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేయడం ప్రారంభించారు. వరుసగా వీడియోలు విడుదల చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గట్టిగానే నిలదీస్తున్నారు. తాజాగా ఓ వీడియో విడుదల చేశారు. కర్మ చుట్టూ ఆయన కామెంట్స్ కొనసాగాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని కర్మ విడిచిపెట్టదు అని ఆయన తేల్చి చెప్పారు.ఇటీవల శాసనమండలిలో నెయ్యి కల్తీ వ్యవహారంపై చర్చ జరిగిన సంగతి తెలిసిందే. అయితే అర్థాంతరంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆందోళనతో మండలిలో చర్చ ముగిసింది. అందుకే తనకు ఏ అవకాశం రాలేదని.. మాట్లాడలేకపోయానని.. అందుకే ఈ ప్రత్యేక వీడియో విడుదల చేయాల్సి వచ్చిందని చెప్పుకొచ్చారు నాగబాబు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తప్పుల మీద తప్పులు చేసిందని.. నెయ్యి కల్తీ చేశారని.. టికెట్ల జారీలో కూడా అవినీతి జరిగిందని.. వీటన్నింటికీ మూల్యం చెల్లించుకోక తప్పదని.. కర్మ ఎవరిని విడిచి పెట్టదు అని కొన్ని ఆధ్యాత్మిక మాటలతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఓ రేంజ్ లో వేసుకున్నారు నాగబాబు. అయితే నాగబాబు వీడియో జనసైనికులకు బాగానే తాకింది. ఇకనుంచి టీటీడీ లడ్డు వ్యవహారంలో జనసేన సైతం విరుచుకు పడే పరిస్థితి కనిపిస్తోంది.మొన్న ఆ మధ్యన పవన్ కళ్యాణ్ పార్టీ శ్రేణులను గట్టిగానే హెచ్చరించిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం అంటే ఒక్క తెలుగుదేశం పార్టీ మాత్రమే కాదు అని.. అందులో జనసేన సైతం ఉందన్న విషయాన్ని గ్రహించుకోవాలని హెచ్చరించిన సంగతి తెలిసిందే. సినిమా పరిశ్రమపై మాట్లాడేవారు సైతం లడ్డు వివాదంపై ఎందుకు మాట్లాడడం లేదని పవన్ ప్రశ్నించినట్లు ఆ మధ్యన కామెంట్స్ వినిపించాయి. పవన్ కళ్యాణ్ ఓ దశలో మెగా బ్రదర్ నాగబాబు పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. అప్పటినుంచి నాగబాబు వీడియోలు విడుదల చేస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడుతున్నారు. పవన్ కళ్యాణ్ ఆగ్రహం బాగానే పనిచేస్తుందన్న కామెంట్స్ ఇప్పుడు వినిపిస్తున్నాయి. మొత్తానికి అయితే మెగా బ్రదర్ నాగబాబు వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# మార్చురీలో పీక్కుతున్న మృతదేహాలు

మహబూబ్ నగర్, మార్చి 4

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో చోటుచేసుకున్న అమానవీయ ఘటనపై ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. మార్చురీలో భద్రపరిచిన ఒక వ్యక్తి మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్నాయన్న వార్తపై ప్రభుత్వం వెంటనే స్పందించింది.ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశార. ఆయన ఆదేశాల అనంతరం.. మంగళవారం రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ స్వయంగా జడ్చర్ల ఆసుపత్రిని సందర్శించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. మార్చురీ నిర్వహణలో దారుణమైన వైఫల్యం , విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్లు తేలడంతో నలుగురిపై సస్పెన్షన్ వేటు వేశారు. సస్పెండ్ అయిన వారిలో ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రకళ, ఆర్ఎంవో హరినాథ్, డ్యూటీ డాక్టర్ , ఎంఎస్వో ఉన్నారు.మార్చురీ వంటి సున్నితమైన ప్రదేశాలలో కనీస రక్షణ కరువవడం, కుక్కలు లోపలికి వెళ్లి మృతదేహాన్ని పీక్కుతినే వరకు సిబ్బంది గుర్తించకపోవడంపై ప్రజల నుండి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వ ఆసుపత్రులలో మృతదేహాలకు కూడా గౌరవం దక్కడం లేదని బాధితుల బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని మార్చురీల భద్రతను పటిష్టం చేయాలని ఆరోగ్య శాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

# తమ్మినేని అభిశంసన... రాజకీయ పార్టీలో చర్చలు

హైదరాబాద్, మార్చి 4

సీపీఎం సీనియర్ నాయకుడు, తెలంగాణ మాజీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను పార్టీ కేంద్ర కమిటీ అభిశంసించడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. జీవితాంతం కమ్యూనిస్టు సిద్ధాంతాల కోసం పోరాడిన ఒక కీలక నేతపై ఇటువంటి క్రమశిక్షణ చర్య తీసుకోవడం వెనుక అనేక బలమైన కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది.కమ్యూనిస్టు పార్టీ రాజ్యాంగం ప్రకారం అభిశంసన అనేది ఒక తీవ్రమైన క్రమశిక్షణ చర్య. పార్టీ నిబంధనలను ఉల్లంఘించినా లేదా పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే పనులు చేసినా ఈ చర్య తీసుకుంటారు. ఇది బహిష్కరణ లేదా సస్పెన్షన్ కంటే తక్కువ స్థాయిదైనప్పటికీ, ఒక నాయకుడి రాజకీయ జీవితంలో ఇది ఒక మచ్చగా పరిగణిస్తారు. తప్పును అధికారికంగా ఎత్తిచూపుతూ, భవిష్యత్తులో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించడమే దీని ఉద్దేశం.తమ్మినేని వీరభద్రంపై కేంద్ర కమిటీ ప్రధానంగా రాజకీయ వ్యూహకర్తగా విఫలమయ్యారనే ఆరోపణలు చేసింది. రాష్ట్ర కార్యదర్శిగా ఆయన తీసుకున్న కొన్ని నిర్ణయాలు పార్టీ అస్తిత్వానికే ముప్పు తెచ్చాయని హైకమాండ్ భావించింది. ముఖ్యంగా బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ప్రయోగం ఘోరంగా విఫలమవ్వడం, దాని వల్ల పార్టీకి రావాల్సిన ఓట్లు కూడా చీలిపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కొత్త రాష్ట్ర కార్యదర్శి ఎన్నిక సమయంలో తమ్మినేని తన వర్గానికి అనుకూలంగా లాబీయింగ్‌కు పాల్పడ్డారని, తెరవెనుక మంత్రాంగాలు నడిపారని పార్టీ గుర్తించింది. ఇది సీపీఎం పద్ధతులకు విరుద్ధమని కేంద్ర కమిటీ స్పష్టం చేసింది. తనపై వచ్చిన ఆరోపణలకు తమ్మినేని ఇచ్చిన వివరణలో ఎక్కడా ఆత్మవిమర్శ కనిపించలేదని, చేసిన తప్పులను సమర్థించుకోవడానికే ప్రయత్నించారని పార్టీ అధిష్ఠానం అసంతృప్తి వ్యక్తం చేసింది.తమ్మినేని నాయకుడిగా ఉన్నప్పుడు తీవ్రమైన నిర్మాణ అనైక్యత చోటు చోటు చేసుకుందని.. ముఠా తత్వం ఏర్పడిందని.. ప్రమాణాల ఉల్లంఘన కొనసాగుతోందని.. అస్తిత్వవాద రాజకీయాల ప్రభావం నడుస్తుందని.. తప్పుడు రాజకీయ దృక్పథం.. ఫెడరల్ ధోరణులు.. పార్టీ విలువలు తగ్గిపోవడం ఇటువంటివి చోటు చేసుకుంటున్నట్టు అభిశంసన లేఖ లో కేంద్ర కమిటీ ప్రస్తావించినట్టు తెలుస్తోంది..కేంద్ర కమిటీకి తమ్మినేని వీరభద్రం.. రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఉన్న స్కైలాబ్ బాబు.. ప్రసాద్ ఇచ్చిన వివరణలు సరిగా లేవని పార్టీ కేంద్ర నాయకత్వం ఇప్పటికే పేర్కొంది. అందులో కనీసమైన ఆత్మ విమర్శ కూడా లేదని స్పష్టం చేసింది. కేంద్ర కమిటీ నిర్మాణానికి తగిన విధంగా ప్రవర్తించడంలో విఫలమైన తమ్మినేని వీరభద్రం.. స్కైలాబ్ బాబు.. ప్రసాద్ పై కేంద్ర కమిటీ చర్యలు తీసుకుందని.. వారి ముగ్గురిని కూడా అభిశంసించిందని సమాచారం.తమ్మినేని వీరభద్రాన్ని కేవలం రాష్ట్ర సెక్రటేరియట్.. కమిటీ సమావేశాలలో పరిశీలకుడిగా మాత్రమే నడుచుకోవాలని.. రాష్ట్ర సెక్రటేరియట్ నాయకత్వంలో పనిచేయాలని కేంద్ర కమిటీ సూచించినట్టు సమాచారం. ముగ్గురు కీలక నాయకులు తప్పులు చేసిన నేపథ్యంలో.. ఈ చర్యలు వారి నడవడికలో మార్పును తీసుకొస్తాయని ఆశిస్తున్నట్టు కేంద్ర కమిటీ ప్రకటించింది.తమ్మినేని వీరభద్రం అభి శంసనకు గురైన నేపథ్యంలో.. సరిగ్గా 18 సంవత్సరాల క్రితం విడుదలైన ఓ పుస్తకాన్ని కొంతమంది గుర్తు చేస్తున్నారు. నాడు సిపిఎం పార్టీలో ఉన్న కొంతమంది వ్యక్తులు నిప్పుకు చెదలు అనే పేరుతో ఒక పుస్తకాన్ని విడుదల చేశారు. ఆ పుస్తకం ముందు పేజీ మీద సిపిఐ (ఎం) పేరుతో 60 పేజీల అసలు వ్యవహారాలను తెరపైకి తీసుకొచ్చారు. అప్పట్లో ఈ పుస్తకం సంచలనం కలిగించింది. చాలామంది నాయకుల త్యాగాలతో ఏర్పడిన పార్టీ.. ఇప్పుడు స్వార్థపరుల చేతుల్లోకి వెళ్లిందని.. మొత్తం బలిపీఠం ఎక్కిందని అందులో వాస్తవిక వాదులు పేర్కొన్నారు.ఆ పుస్తకాన్ని అప్పటి సిపిఎం ఖమ్మం జిల్లా నాయకులు వనం నరసింహ రావు.. వై వినయ్ కుమార్.. రాయల వెంకటేశ్వర్లు.. కిలారు సీతారాములు.. ఎర్రబోయిన సీతారాములు.. నల్లపునేని అప్పారావు.. జొన్నలగడ్డ రవికుమార్.. ఇలవల పుల్లారెడ్డి.. ఎడవల్లి రాంరెడ్డి రచించారు. ఆ పుస్తకం వెలుగులోకి వచ్చిన తర్వాత రూపకర్తలందరూ బహిష్కరణకు గురయ్యారు. అయితే ఈ పుస్తకం వెనుక టీఎన్ ప్రసాద్, ధనాల కొండయ్య వంటి వ్యక్తులు కూడా ఉన్నట్టు ప్రచారంలో ఉంది. ఈ నాయకుల్లో టివిన్ ప్రసాద్.. ఇంకా కొంతమంది వేరువేరు కారణాల వల్ల చనిపోయారు. మిగతా వారంతా వేరువేరు పార్టీలలో కొనసాగుతున్నారు.నాడు విడుదల చేసిన నిప్పుకు చెదలు పుస్తకంలో బోడెపూడి వెంకటేశ్వరరావు, బాజీ హనుమంతు, ఎడవల్లి పద్మారెడ్డి, గట్లూరి కిషన్ రావు, బండారు చంద్రరావు, ఏలూరు లక్ష్మీనారాయణ, బోజడ్ల వెంకటనారాయణ, రావెళ్ళ సత్యనారాయణ, టీవీఆర్ చంద్ర, మంచి కంటి రామ్ కిషన్ రావు, శేషగిరిరావు, బోడెపూడి వెంకటేశ్వరరావు, చిర్రావూరి లక్ష్మీనారాయణ వంటి వ్యక్తులను ప్రముఖంగా ప్రస్తావించారు. వారు చేసిన త్యాగాల వల్ల పార్టీ ఏ స్థాయికి ఎదిగిందో గుర్తు చేశారు. తమ్మినేని నాయకుడిగా మారిన తర్వాత.. పార్టీ దిగజారిన తీరు.. ముదిగొండ కాల్పులు.. పాలేరు డివిజన్లో కుటుంబ సభ్యుల పెత్తనం వంటి వాటిని ఆ పుస్తకంలో ప్రముఖంగా ప్రస్తావించారు.ఈ పుస్తకం తోనే ఆ నాయకులు ఆగిపోలేదు. నాడు ఉమ్మడి



రాష్ట్రానికి కార్యదర్శిగా ఉన్న బీవీ రాఘవులకు.. జాతీయ కార్యదర్శి ప్రకాష్ కారత్ వంటి వారికి లేఖలు కూడా రాశారు. ఆ పుస్తకాలలో ఉన్న ప్రముఖమైన విషయాలను కూడా వారి దృష్టికి తీసుకెళ్లారు. ఇంత చేసినప్పటికీ బివి రాఘవులు లాంటి నాయకుడు తమ్మినేని వీరభద్రాన్ని బంగారం అని ప్రస్తావించారు. అయితే ఇన్నాళ్లకు పార్టీ కేంద్ర కమిటీ తమ్మినేని వీరభద్రాన్ని.. ఇంకా ఇద్దరు ముఖ్య నాయకులను అభి శంసించడం నిజంగా ఆశ్చర్యకరం.తమ్మినేని రాజకీయ జీవితంలో ఇంకా కొన్ని కోణాలను ఇక్కడ కేంద్ర కమిటీ పక్కనపెట్టినట్టు కనిపిస్తోంది. ముఖ్యంగా తమ్మినేని పార్టీకి చేసిన సేవలను.. పురోగతికి శ్రమించిన తీరును కేంద్ర కమిటీ పట్టించుకోవడం తెలుస్తోంది. గోదావరి జలాలను పాలేరుకు అనుసంధానించాలని తమ్మినేని వీరభద్రం 20 సంవత్సరాల క్రితమే దుమ్ముగూడెం నుంచి పాలేరు నియోజకవర్గం వరకు 100 రోజులపాటు పాదయాత్ర చేశారు. దాదాపు 2792 కిలోమీటర్ల మేర నడిచారు.ఆ పాదయాత్ర గురించి ఇప్పటికి ఖమ్మం రాజకీయాలలో చర్చ నడుస్తూనే ఉంటుంది. తమ్మినేని కృష్ణయ్య హత్యకు గురికావడం.. ఈ వ్యవహారంలో తమ్మినేని వీరభద్రం సోదరుడు కోటేశ్వరరావు.. ఇంకా కొంతమంది వ్యక్తులు అభియోగాలు ఎదుర్కొంటూ ఉండడం వంటి కారణాలు కేంద్ర కమిటీ దృష్టికి వెళ్లి ఉండవచ్చని.. అందువల్లే ఈ తరహాలో అభిశంషన ఇచ్చి ఉండవచ్చని వాదనలు కూడా వినిపిస్తున్నాయి.ఎన్నో రకాల పరిణామాలు ఎదుర్కొని.. రాజకీయ జీవితాన్ని రకరకాలుగా మార్చుకొని.. 72 సంవత్సరాల వయసులో అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న తమ్మినేని వీరభద్రం.. ఇప్పుడు కేంద్ర కమిటీ నుంచి అభిశంసన ఎదుర్కోవడం సంచలనం కలిగిస్తోంది. అభిశంసన అనేది కమ్యూనిస్టు పార్టీలో తీవ్రమైన హెచ్చరిక అయినప్పటికీ.. తమ్మినేని వీరభద్రం లేకుండా తెలంగాణలో పార్టీ నడుస్తుందా? పార్టీ ముందుకు వెళ్తుందా? ఈ ప్రశ్నలకు ఇప్పుడు సమాధానాలు లభించాల్సి ఉంది

==============

# ప్రాణం మీదకు వస్తున్న అల్లం వెల్లుల్లి పేస్ట్...

హైదరాబాద్, మార్చి 4,

హైదరాబాద్?లో పెద్ద మొత్తంలో కల్తీ అల్లం-వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం చేసుకున్నారు. ఇది ఆరోగ్యానికి ఎంతో ప్రమాదామని చెప్తున్నారు. కల్తీ వెల్లుల్లి-అల్లం పేస్ట్ ఎక్కువగా తింటే హానికరమైన ప్రభావాలు ఉంటాయని అంటున్నారు. అయితే దీని గురించి సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతుంది. దీనిని ఎక్కువగా తింటే.. అవయవాలు కుళ్లిపోతాయంటూ చెప్తున్నారు. మరి దీనిలో వాస్తవమెంతో చూసేద్దాం. హైదరాబాద్?లో తాజాగా నాలుగు వేల కిలోగ్రాముల కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం చేసుకున్నారు. నివేదికల ప్రకారం హైదరాబాద్ పోలీసులు ఎంఎస్ మక్త రైల్వే గేట్ సమీపంలో ఆకస్మిక దాడి నిర్వహించి.. ఒక కంటైనర్‌లో అపరిశుభ్రంగా నిల్వ చేసిన అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను కనుగొన్నారు. ఈ కేసుకు సంబంధించి 21 ఏళ్ల వ్యక్తిని కూడా అరెస్టు చేశారు. ఈ కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ మీ ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో.. దాని వల్ల ఏ అవయవాలు ఎక్కువగా ప్రభావితమవుతాయో చూసేద్దాం.వంటగదిలో రోజూ ఉపయోగించే అల్లం-వెల్లుల్లి పేస్ట్ కల్తీ అయితే.. అది తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాన్ని కలిగిస్తుంది. చెన్నైలోని శ్రీ బాలాజీ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో నమోదైన డైటీషియన్ దీపలక్ష్మి ప్రకారం.. ఈ పేస్ట్ పరిమాణాన్ని పెంచడానికి పిండి లేదా కార్న్‌ఫ్లోర్‌ను కలుపుతారు. దానిని తాజాగా కనిపించేలా చేయడానికి, ఎక్కువసేపు ఉంచడానికి కృత్రిమ రంగులు, సంరక్షణకారులు కూడా కలుపుతారు. కొన్ని సందర్భాల్లో పాత లేదా చెడిపోయిన అల్లం, వెల్లుల్లిని కూడా ఉపయోగిస్తారు.జూలై 2025లో ఇలాంటిదే ఒక కేసు నమోదైంది. అక్కడ ఆహార భద్రతా అధికారులు కొన్ని ఫుడ్స్?లో టైటానియం డయాక్సైడ్, మోనోసిట్రేట్ వంటి హానికరమైన కెమికల్స్ గుర్తించారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం.. ఆహార ఉత్పత్తిలో ఇటువంటి పదార్థాల వాడకం నిషేధం. దర్యాప్తులో రంగును పెంచడానికి ఉపయోగించే పెద్ద మొత్తంలో టైటానియం డయాక్సైడ్, మోనోసిట్రేట్, పసుపు పొడిని స్వాధీనం చేసుకున్నారు.ఈ కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను తీసుకోవడం వల్ల గ్యాస్, అసిడిటీ, విరేచనాలు వంటి జీర్ణ సమస్యలు వస్తాయి. దీర్ఘకాలిక వినియోగం



కాలేయం, మూత్రపిండాలను కూడా ప్రభావితం చేస్తుంది. రసాయన కల్తీ కొంతమందిలో అలెర్జీలు, చర్మ సమస్యలు లేదా శ్వాసకోశ సమస్యలను కూడా కలిగిస్తుంది. అలాగే కల్తీ అల్లం, వెల్లుల్లి సహజ ప్రయోజనాలను తగ్గిస్తుంది. ఇంట్లోనే కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్?ను గుర్తించేందుకు కొన్ని టిప్స్ ఫాలో అవ్వొచ్చు. పేస్ట్ ముదురు లేదా రంగు మారకుండా లేత ఐవరీ రంగులో ఉండాలి. ఇది బూజు, బూజు లేదా దుర్వాసన లేకుండా ఉండాలి. ఆకృతి మృదువుగా, స్థిరంగా ఉండాలి. సువాసన ఘాటుగా ఉండాలి. తాజా అల్లం, వెల్లుల్లి వాసన ఇవ్వాలి. రుచి చేదుగా లేదా పాతదిగా ఉండకూడదు. ప్యాక్ చేసిన ఉత్పత్తిని కొనుగోలు చేసేటప్పుడు.. పదార్థాల జాబితాను తప్పకుండా చదవాలి. స్వచ్ఛమైన పేస్ట్‌లో ప్రధానంగా అల్లం, వెల్లుల్లి ఉండాలి. కృత్రిమ రంగులు లేదా సంరక్షణకారులను తక్కువగా జోడించాలి.

# పిపి విధానంలో పది వైద్య కళాశాలలు

అమరావతి

రానున్న 2 ఆర్థిక సంవత్సరాల్లో పి పి విధానంలో 10 వైద్య కళాశాలలను నడిపేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. 17 కాలేజీల్లో 11 నాబార్డు కింద, 3 కేంద్రం, 3 సాస్కి కింద మంజూరయ్యాయి. మొత్తం వ్యయం రూ8480కోట్లు. గత ప్రభుత్వ హయాంలో కేవలం 1, 500 కోట్లు మాత్రమే ఖర్చుపెట్టారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడించారు.

బుధవారం నాడు అయన శాసనసభలో ప్రభుత్వ వైద్య కళాశాలలు.. పీపీ విధానంపై సభ్యుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

మంత్రి మాట్లాడుతూ ఆ ఖర్చులో పులివెందుల కాలేజీకి మాత్రమే దాదాపు రూ 500 కోట్లు ఖర్చుపెట్టి మిగిలిన కాలేజీల విషయంలో జగన్ వివక్ష ప్రదర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.900 కోట్ల విలువైన పనులు చేసింది. వైసీపీ వారు కాలేజీలు నిర్మించేసామని అసత్య ప్రచారం చేస్తున్నారు . పార్వతిపురంలో వైద్య కళాశాల నిర్మాణానికి కనీసం భూ సేకరణ చేపట్టలేదు . ఐదేళ్ల వైసీపీ అరాచక పాలన కారణంగా 11 సీట్లకు పడిపోయారు. అయినా బెదిరింపులు ఆపడంలేదని అన్నారు.

# రోడ్డు ప్రమాద బాదితులను కాపాడితే రహ్ వీర్ పథకం ద్వారా రూ.25 వేల పారితోషికం: జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల జిల్లా.. మార్చి 4

రోడ్డు ప్రమాదాల సమయంలో గాయపడిన వారికి తక్షణ సహాయం అందించి వారి ప్రాణాలను కాపాడే బాధ్యతగల పౌరులను (గుడ్ సమారిటన్స్) ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "రహ్ వీర్ పథకం" ద్వారా రూ.25,000/- నగదు పారితోషికం మరియు ప్రశంసా పత్రం అందజేయబడుతుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ప్రమాదం జరిగిన తొలి గంటను "గోల్డెన్ అవర్"గా పరిగణిస్తారని ఈ సమయంలో బాధితులకు సమయానికి వైద్య సహాయం అందితే అనేక ప్రాణాలు రక్షించవచ్చని పేర్కొన్నారు. కానీ కొంతమంది పౌరులు పోలీస్ కేసులు ఉండొచ్చనే భయంతో గాయపడిన వారికి సహాయం చేయడానికి వెనుకంజ వేస్తున్నారని ఈ భయాలను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం "రహ్ వీర్ పథకం"ను అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకం ప్రకారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి ప్రాణాలను కాపాడిన వారికి ప్రభుత్వం రూ.25 వేల నగదు ప్రోత్సాహంతో పాటు ప్రశంసా పత్రం అందజేస్తుంది. సహాయం చేసిన వ్యక్తిపై ఎలాంటి చట్టపరమైన ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు.రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే 108 అంబులెన్స్ సేవలకు సమాచారం ఇవ్వాలని, సమీపంలోని ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆసుపత్రికి గాయపడిన వారిని తరలించాలని సూచించారు. ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించి ప్రాణాలను కాపాడే కార్యంలో భాగస్వామి కావాలని కోరారు.

# ఢిల్లీ కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్ మార్చి 4,

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధిష్టానం పిలుపుతో ఢిల్లీ బయలుదేరారు. రెండు రాజ్యసభ సీట్లు కోసం అభ్యర్థుల ఫైనల్ చేసే అవకాశం వుందని సమాచారం . ఇప్పటికే అభిషేక్ సింగ్వి పేరు ఖరారు అయింది. అయన బుధవారం హైదరాబాద్ చేరుకున్నారు. మరో సీట్ కోసం టీపీసీసీ నేతల మధ్య పోటీ ఏర్పడింది. ఇప్పటికే 16 మంది తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. రెండో అభ్యర్థి విషయంలో ఇంకా కొలిక్కి రాకపోవడంతో సీఎంను అధిష్టానం ఢిల్లీకి పిలిపించింది. మరో వైపు రాజ్యసభ సీటు పై ఆశావహుల అసంతృప్తి ఎక్కువయింది.



మాదిగ సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలి అంటూ రాహుల్ గాంధీ కి మందకృష్ణ మాదిగ బహిరంగ లేఖ రాసారు. బీసీ సామాజికవర్గం నుండి రేసులో వీహెచ్, ఇరవత్రిఅనిల్, మధుయాష్కీ, వినయ్ కుమార్ గౌడ్, నేరెళ్ల శారద వున్నారు. ఎస్సీ సామాజిక వర్గం నుండి ,సంపత్, దొమ్మాటి సాంబయ్య వున్నారు. రెడ్డి సామాజిక వర్గం నుండి రేసులో వేం నరేందర్ రెడ్డి,చిన్నా రెడ్డి,రోహిన్ రెడ్డి,జీవన్ రెడ్డి,వంశీ చందర్ రెడ్డి,కోదండరెడ్డి వున్నారు. ఎస్టీ నుండి రేసులోబెల్లయ్య నాయక్, మైనార్టీ నుండి రేసులో అజ్ఞాతుల్లా హుసేన్, షబ్బీర్ అలీ వున్నారు.

# హోలీ సంబురాలలో పాల్గొన్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్ మార్చి 4, బోయిన్ పల్లి లోని మల్లారెడ్డి గార్డెన్స్ లో మహావీర్ ఇంటర్నేషనల్ ఉడాన్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన హోలీ సంబురాలలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంబురాలలో పాల్గొన్న అందరికీ ఎమ్మెల్యే శ్రీగణేష్ శుభాకాంక్షలు తెలిపి చెడు పై మంచి గెలుపునకు సూచికగా 'కామ దహనం'తో ప్రారంభమయ్యే హోలీ పండుగ మనందరి జీవితాల్లో కొత్త రంగులు అద్దుతుందని అన్నారు.హోలీ పండుగ సందర్భంగా బంధుమిత్రులతో, సాటివారితో ఆనందం పంచుకుని అందరూ సుఖసంతోషాలతో ఉండడం ఆనందంగా ఉందని, మహావీర్ ఇంటర్నేషనల్ ఉడాన్ సంస్థ ఇలాంటి మంచి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు.అలాగే తుకారాం గేట్ లోని ఎమ్మెల్యే నివాసం వద్ద జరిగిన హోలీ వేడుకలలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి పాల్గొని అందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రభుత్వానికి విజన్ లేదు బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీ ఎస్ ఎస్ ప్రభాకర్

హైదరాబాద్ మార్చి 4,

గత రెండేళ్లలో 60 సార్లుఐఏఎస్ అధికారుల ల బదిలీలు జరిగాయి. పాలన మీద కాంగ్రెస్ కు పట్టు లేదు. కలెక్టర్లు ప్రజల్లో తిరగడం లేదని సీఎం మాటలతో అర్థం అవుతుంది. సీఎం మాట ఎవ్వరూ వినడం లేదని తెలుస్తుందని బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. రాజ్య సభ ఎన్నికల ద్వారా బీ ఆర్ ఎస్ కు మంచి అవకాశం వచ్చింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలు రాజ్య సభ ఎన్నికలో ఎవ్వరికీ మద్దతు తెలుపుతారో బయటపడుతుంది. రాష్ట్రంలో బీ ఆర్ ఎస్ కాంగ్రెస్ ఆటను ప్రజలు గమనిస్తున్నారు. అధికారులకు , మంత్రులకు ఎమ్మెల్యేలకు జనంలో తిరిగే మొఖం లేదు, జీహెచ్ఎంసి విస్తరణ చేసి తర్వాత హైద్రాబాద్ ను మూడు ముక్కలు చేసింది, ప్రభుత్వానికి విజన్ లేదని అర్థం అవుతుందని అన్నారు.

# తెలంగాణ ప్రభుత్వం పేద విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతుంది:

## టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు

ఖమ్మం బ్యూరో, భారత శక్తి, మార్చి 4:

ఖమ్మం నగరం లోని సాంఘీక సంక్షేమ బాలికల వసతి గృహం (ఎ) నందు బుధవారం హాస్టల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. వసతి గృహ సంక్షేమ అధికారిని నెల్లూరి విజయ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ...... ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు ఉపయోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు.

టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టల్లో చదివే విద్యార్థులు అన్ని రంగాలలో మంచి పేరు తెచ్చుకోవాలని, హాస్టల్ డే కార్యక్రమాలు పిల్లల్లో ఉత్తేజాన్ని నింపుతాయని అన్నారు. టీఎన్జీవో జిల్లా కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు శ్రద్ధగా చదివి పరీక్షలు లో మంచి ఫలితాలు సాధించాలన్నారు.

హాస్టల్ డే వేడుకను ఘనంగా నిర్వహించిన హాస్టల్ సిబ్బందిని అతిథులు అభినందించారు. ఈ కార్యక్రమంలో , టీఎన్జీవో ప్రచార కార్యదర్శి యారామల్ల శ్రీనివాస్, ఏ ఎస్ డబ్ల్యూ ఓ అబ్దుల్ రావుఫ్, హాస్టల్ వెల్ఫేర్ ఫోరమ్ జిల్లా అధ్యక్షులు కోటపాటి రుక్మారావు, నాయకులు సువర్జన్ ఫాల్, వసతి గృహ సంక్షేమ అధికారిణి జి.వరలక్ష్మి , టీ.స్టాలిన్, వసతి గృహ సిబ్బంది, తల్లి దండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.




# అన్నదానం నిర్వహించిన గురుస్వాములు



మణుగూరు, మార్చి 04 (భారతశక్తి) : మండలంలోని అయ్యప్పస్వామి పీఠాల గురుస్వాములు, కమలాపురం అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో శ్రీ హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్రం జన్మదినం సందర్భంగా కమలాపురం గ్రామంలోని రామాలయంలో బుధవారం అన్నదానం నిర్వహించారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీ అయ్యప్ప స్వామికి విశేషమైన ఉత్తర నక్షత్ర పూజలు నిర్వహించారు. మణుగూరు మండలంలోని అయ్యప్పస్వామి పీఠాల గురుస్వాములు సంకల్ప బలం సహకారంతో ప్రతి నెలలో వచ్చే అయ్యప్ప స్వామి వారి జన్మ నక్షత్రం ఉత్తరా నక్షత్రం రోజున వివిధ పీఠాల్లో, మహా అన్నదానం చేయడం జరుగుతుందని గురుస్వాములు తెలియజేశారు. అన్నదాన కార్యక్రమాల్లో ముందుగా అర్చకులు గణపతి మంత్రోచ్చరణతో అయ్యప్ప స్వామి వారి విగ్రహానికి ప్రతిష్టించి పుష్పాలతో అభిషేకం చేసి పూల మాల వేసి కన్నుల పండువగా అలంకార ప్రియుడిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వడ్డించిన వంటకాలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అయ్యప్పస్వామి మాలలు ధరించినప్పుడే అయ్యప్ప మహిమలు గుర్తు చేసుకుంటున్నామని గురు స్వాములు తెలిపారు. అలా కాకుండా ప్రతి నెలలో వచ్చే ఉత్తరా నక్షత్రం అయ్యప్ప స్వామి వారి జన్మ నక్షత్రంగా భావించి ప్రతి రోజు అయ్యప్పస్వామిని తలుచుకునే విధంగా మండలంలోని పీఠాల గురుస్వాములు సంకల్పించి మహా అన్న ప్రసాద కార్యక్రమాలు నిర్వరామంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. అయ్యప్పస్వామి వారి మహా ప్రసాదం స్వీకరించిన భక్తులకు అయ్యప్ప దీవెనలు మెండుగా ఉండాలని ఆశీర్వదించారు.

# కోనేటి లక్ష్మయ్యకు ఘన నివాళులర్పించిన జిల్లా కాంగ్రెస్ నాయకులు శెట్టి రంగారావు



ఖమ్మం బ్యూరో, భారత శక్తి, మార్చి 4: ఖమ్మం పట్టణ పరిధిలోని బోనకల్ రోడ్డు శ్రీరామ్ హిల్స్ నందు కోనేటి లక్ష్మయ్య దశదినకర్మలో పాల్గొని ఘన నివాళులర్పించిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు శెట్టి రంగారావు. ఈ సందర్భంగా ఆయన కుమారుడు కోనేటి నారాయణను పరామర్శించి మనోధైర్యంతో ముందుండాలని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు వడ్డెబోయిన నరసింహారావు, శెట్టి రంగారావు, ఆకుతోట రాజశేఖర్, అనంతుల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# 25 వేల బోగస్ ఉద్యోగుల కుంభకోణం

## ఫోరెన్సిక్ ఆడిట్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు?

అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలపై కేసులు నమోదు చేయాలని స్పష్టం రాష్ట్రంలో భారీ స్థాయిలో ఉద్యోగాల కుంభకోణం వెలుగులోకి వచ్చింది. సుమారు 25 వేల మంది బోగస్ ఉద్యోగులను ఉన్నట్లుగా చూపించి, నెలనెలా జీతాలు తీసుకున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్థిక శాఖకు కఠిన ఆదేశాలు జారీ చేశారు.

ఆధార్ లింకేజీతో బయటపడిన మోసం ప్రభుత్వం చేపట్టిన ఆధార్ లింకేజీ ప్రక్రియలో ఈ భారీ అక్రమం బయటపడింది. ఉద్యోగుల పేర్లతో జీతాలు డ్రా చేస్తున్నా, వాస్తవానికి ఆ వ్యక్తులు ఉద్యోగంలో లేరని గుర్తించారు. గత పదేళ్లుగా ఈ మోసం కొనసాగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఈ కుంభకోణం వల్ల ప్రభుత్వ ఖజానాకు కోట్లాది రూపాయల నష్టం జరిగిందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# పాత కక్షలతో యువకుడిపై దాడి

అన్నమయ్య భారత శక్తి, మార్చి 4:

మదనపల్లె మున్సిపాలిటీ సమీపంలో మంగళవారం రాత్రి పాత కక్షలతో ప్రసాద్ (41) అనే వ్యక్తిపై కొందరు దుండగులు దాడికి పాల్పడ్డారు.

గొడవ జరుగుతున్న సమయంలో అరుపులు విని అక్కడికి చేరుకున్న వైసీపీ మాజీ మేదర కార్పొరేషన్ డైరెక్టర్ తాలే సుబ్బుపై కూడా కత్తి తో దాడి చేసినట్లు సమాచారం.

ఈ ఘటనలో గిరీష్, షఫీ, ముని, మస్తాన్, ఫరీద్ డాడీ పాల్గొన్నట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


# బీఆర్ఎస్ నేతలపై దాడులు సరికావు

సూర్యాపేట భారత శక్తి, మార్చి 4:

సూర్యాపేటలో కాంగ్రెస్ పార్టీ నాయకుల వరుస దాడులను మాజీ ఎంపీ, సూర్యాపేట జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్ ఖండించారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో అయన మాట్లాడారు.

కాంగ్రెస్ నేతలు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. అరాచక శక్తులను ప్రోత్సాహించడం సరికాదు. రెండేళ్ల పాలనలో అరాచకాలు తప్ప అభివృద్ధి శూన్యం. బీఆర్ఎస్ నాయకులపై దాడులు చేస్తామంటే సహించేది లేదు. మొన్న 24, 26, నిన్న 9 వ వార్డు.. ఇలా వరుస దాడులకు పాల్పడటం సరికాదు. స్థానిక మంత్రులు ఆ పార్టీ నాయకులపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలి. పోలీసులు సరైన విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. దాడులు ఆపకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని అన్నారు.

# సినిమా



## 24 గంటల్లో 46 మిలియన్ వ్యూస్

రామ్ చరణ్‌హీరోగా బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న భారీ చిత్రం పెద్దిపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. విలేజ్ బ్యాక్‌డ్రాప్, ఎమోషన్స్, మాస్ ఎలిమెంట్స్ కలియికతో రూపొందుతున్న ఈ సినిమా నుంచి వచ్చిన ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఇంట్రెస్ట్ పెంచుతోంది. ఈ మూవీ నుంచి ఇప్పటికే రిలీజైన చికిరి చికిరి సాంగ్ ఆడియన్స్ ను ఓ ఊపు ఊపేయగా.. తాజాగా రైరై రారా అంటూ విడుదల చేసిన మరో సాంగ్ 24 గంటల్లోనే 46.1 మిలియన్ వ్యూస్ సాధించి టాలీవుడ్‌లో అత్యధిక వ్యూస్ సాధించిన లిరికల్ సాంగ్ గా నిలిచింది. ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూర్చి స్వయంగా ఆలపించిన ఈ గీతానికి అనంత శ్రీరామ్ సాహిత్యం అందించాడు. జానీ మాస్టర్ రూపొందించిన కొరియోగ్రఫీ ఈ పాటకు హైలైట్‌గా నిలిచింది. చెర్రీ చేసిన గ్రేస్‌ఫుల్ స్టెప్పులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఫాస్ట్ మూమెంట్స్, మాస్ ఎనర్జీతో కూడిన డ్యాన్స్ చూసిన అభిమానులు చిరుత రోజుల్ని గుర్తు చేసుకుంటున్నారు. టాలీవుడ్‌లో 24 గంటల్లో అత్యధిక వ్యూస్ సాధించిన లిరికల్ పాటల జాబితాలో రెండో స్థానంలో కూడా ఈ మూవీలోని చికిరి చికిరి పాటే నిలవడం విశేషం. ఈ పాట 29.19 మిలియన్ వ్యూస్ దక్కించుకుంది.

## టాక్సిక్ పోస్ట్‌పోన్




కన్నడ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ అవైటెడ్ మూవీ 'టాక్సిక్'. గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని కేవీఎన్‌ప్రొడక్షన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఈనెల 19న గ్రాండ్ రిలీజ్ కి సైతం మేకర్స్ సిద్ధం చేశారు. ఆల్రెడీ బుకింగ్స్ షురూ కాగా.. తాజాగా ఇప్పుడు షాకింగ్ ట్విస్ట్ ఇచ్చారు. ఈ సినిమాని వాయిదా వేస్తున్నట్టు అఫీషియల్ గా ప్రకటించారు. 'మేం ఈ 'టాక్సిక్'ను అన్ని భాషల్లో రిలీజ్ చేయాలని డిసైడ్‌అయ్యాం. ప్రపంచవ్యాప్తంగా ఇంగ్లిష్‌లోనూ విడుదల చేయాలి. బట్ ప్రెసెంట్ మిడిల్ ఈస్ట్ లో అనిశ్చితి నెలకొంది. ఇలాంటి టైంలో సినిమాను విడుదల చేయడం సరైన నిర్ణయం కాదు. అందుకే వాయిదా వేస్తున్నం. జూన్ 4న మళ్లీ మీ ముందుకు వస్తం' అంటూ మేకర్స్‌ప్రెస్‌నోట్ రిలీజ్ చేశారు.

# అది పూర్తిగా అనైతికం

సినిమా ప్రచార కార్యక్రమాలు, ఆడియో లాంచ్‌లు, అవార్డు వేడుకలు వంటి పబ్లిక్ ఈవెంట్లలో హీరోయిన్ల వస్త్రధారణపై చర్చలు కొత్త విషయం కాదు. బహిరంగ వేదికల్లో హీరోయిన్లను అనుచిత కోణాల్లో చిత్రీకరించడం విమర్శలకు దారి తీస్తోన్న నేపథ్యంలో కన్నడ చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు హీరోయిన్లు దీనిపై బహిరంగంగా గళం విప్పారు. కాంతారా చిత్రంతో గుర్తింపు పొందిన సప్తమి గౌడ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో.. మహిళా కళాకారులను కళాకారులుగానే చూడాలని, అనవసర జూమ్‌లు చేసి అవమానకరంగా చూపించడం పూర్తిగా అనైతికమని పేర్కొంది. ఆమె ఆవేదనకు రుక్మిణి వసంత్, ఆషికా రంగనాథ్ మద్దతు పలికారు. కళాకారిణుల వ్యక్తిగత గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత మీడియా, డిజిటల్ కంటెంట్ క్రియేటర్స్‌కి ఉందని పేర్కొన్నారు.



## కొత్త కోడలొచ్చింది.. మంచిగా చూసుకోండి

* విజయ్ దేవరకొండ



కాలక్రమంలో మేం పెద్దవాళ్లం అయిపోతున్నాం, కానీ మిమ్మల్ని మాత్రం మరిచిపోమని ప్రముఖ సినీ నటుడు విజయ్ దేవరకొండ అన్నారు. గత నెలలో విజయ్ దేవరకొండ, రష్మికల వివాహం జరిగిన విషయం తెలిసిందే. ఈ రోజు సాయంత్రం హైదరాబాద్‌లో వీరి రిసెప్షన్ జరగనుంది. దానికి ముందు వారు తెలుగు మీడియాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాలకు కొత్త కోడలు వచ్చింది, బాగా చూసుకోండని సరదాగా అన్నారు. మా సినిమా ప్రయాణంలో మీడియా కూడా ఒక భాగమని తెలిపారు. పెళ్లి చేసుకుని ఇప్పుడు జంటగా మీ ముందుకు వచ్చామని అన్నారు. ఇదో విభిన్న అనుభూతి సమయం అని, క్రమంగా తాము ఎదుగుతూ, కొత్త విషయాలు నేర్చుకుంటున్నామని అన్నారు. మీడియాను మాత్రం ఎప్పటికీ మరిచిపోబోమని పేర్కొన్నారు. మీకు మా హృదయాల్లో ఎప్పటికీ చోటు ఉంటుంది అని అన్నారు. మీ ఆశీస్సులు మాకు కావాలని విజయ్ దేవరకొండ అన్నారు. మేం కొత్త జీవితంలోకి అడుగు పెట్టామని రష్మిక మందన్న అన్నారు.

## 46 ఏళ్ల తర్వాత కమల్ రజనీ కాంబో.. షూటింగ్‌పై కీలక అప్‌డేట్




భారతీయ సినీ దిగ్గజాలు కమల్ హాసన్, రజనీకాంత్ 46 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ కలిసి నటిస్తున్న చిత్రంపై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. 'జైలర్' ఫేం నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్‌పై ఓ కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రం వచ్చే ఏడాది సెట్స్‌పైకి వెళ్లనుంది. ఈ విషయాన్ని స్వయంగా చిత్ర సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ వెల్లడించారు. ప్రస్తుతం కమల్ హాసన్, రజనీకాంత్ తమ కమిట్‌మెంట్లను పూర్తి చేసుకున్న తర్వాత ఈ ప్రాజెక్టులో చేరతారని తెలుస్తోంది. దీంతో ఈ లెజెండరీ కాంబినేషన్ కోసం ఎదురుచూస్తున్న అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఇదిలా ఉంటే... ఈ సినిమా చిత్రీకరణకు సంబంధించి ఓ ఆసక్తికర ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రాన్ని 80, 90ల కాలంలో ఉపయోగించిన పాత ఫిల్మ్ కెమెరాలతో చిత్రీకరించాలని దర్శకుడు నెల్సన్ భావిస్తున్నారట. నిజానికి ఈ సినిమా ప్రోమోను కూడా అదే పద్ధతిలో తీయాలనుకున్నా, సమయాభావం వల్ల డిజిటల్ పద్ధతిలో పూర్తి చేశారని సమాచారం. ఇటీవల విడుదలైన ఈ సినిమా స్పెషల్ గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. తమదైన స్టైల్‌లో ఇద్దరు లెజెండ్స్ కనిపించడంతో సినిమాపై హైప్ మరింత పెరిగింది. రెడ్ జెయింట్ మూవీస్ నిర్మిస్తున్న ఈ చిత్రంతో నెల్సన్ ఎలాంటి అద్భుతం సృష్టిస్తాడోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## గొప్ప మనసు చాటుకున్న అల్లు అర్జున్.. పావలా శ్యామలకు ప్రతి నెలా ఆర్థిక సాయం

సీనియర్ క్యారెక్టర్ ఆర్టిస్ట్ పావలా శ్యామల ఎదుర్కొంటున్న కష్టాలపై అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ స్పందించారు. తీవ్ర అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆమెకు శాశ్వత భరోసా కల్పిస్తూ తన ఉదారతను చాటుకున్నారు. పావలా శ్యామల, ఆమె కుమార్తె వైద్య ఖర్చులు, నిత్యవసరాల కోసం ప్రతి నెలా రూ. 10,000 అందేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వందలాది చిత్రాల్లో తన నటనతో ప్రేక్షకులను అలరించిన పావలా శ్యామల, గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. సరైన ఆదరణ లేక, ఆర్థికంగా చితికిపోయి తన కుమార్తెతో కలిసి సికింద్రాబాద్ కార్ఖానాలోని ఆర్కే ఫౌండేషన్‌లో ఆశ్రయం పొందుతున్నారు. తల్లీకూతుళ్లిద్దరి ఆరోగ్యం క్షీణించి, కనీసం మందులు కొనుక్కోలేని దీనస్థితిలో ఉన్నారని తెలుసుకున్న అల్లు అర్జున్ వెంటనే చలించిపోయారు. వారికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు.

## 'ఉస్తాద్ భగత్‌సింగ్'కు మరో సంగీత దర్శకుడు..దుకంటే?

పవన్ కల్యాణ్ హీరోగా దర్శకుడు హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న సినిమా 'ఉస్తాద్ భగత్‌సింగ్'. ఈ చిత్రానికి ఇప్పుడు మరో సంగీత దర్శకుడు తమన్ ఎంపికయ్యారు. ఈ మూవీకి ఆయన బీజీఎం (నేపథ్య సంగీతం) అందిస్తారని నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ప్రకటించింది. పాటలకు దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు సమకూర్చిన సంగతి తెలిసిందే. ఇద్దరు క్రేజీ మ్యూజిక్ డైరెక్టర్ల వర్క్‌తో రాబోతున్న ఈ సినిమా పవన్ అభిమానులకు ఎప్పటికీ మరిచిపోలేని జ్ఞాపకంగా నిలుస్తుందని సదరు సంస్థ పేర్కొంది. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ విషయంలో.. అనుకున్న సమయానికి దేవిశ్రీ ప్రసాద్‌కు రీల్స్ పంపడంలో ఆలస్యమైందని వివరించింది. దీంతో దేవిశ్రీ ఇప్పటికే అంగీకరించిన ఇతర ప్రాజెక్టుల వల్ల ఈ సినిమాకి మరింత సమయం కేటాయించలేకపోతున్నారని తెలిపింది. పరస్పర అంగీకారంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ సినిమాని ఈ నెల 26న విడుదల చేయనున్నట్లు టీమ్ ఫిబ్రవరిలో ప్రకటించింది. అయితే మార్చి 19న రావాల్సిన యశ్ 'టాక్సిక్' వాయిదా పడటంతో.. ఆ టైమ్‌కు 'ఉస్తాద్ భగత్‌సింగ్'ను తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. పవన్ నటించిన 'వకీల్ సాబ్', 'ఓజీ' తదితర చిత్రాలకు తమన్ వర్క్ చేసిన సంగతి తెలిసిందే. హరీశ్ శంకర్ తెరకెక్కించిన 'మిరపకాయ్', 'రామయ్యా వస్తావయ్యా' సినిమాలకు ఆయనే సంగీత దర్శకుడు.





# నేరేడు పళ్ళు.. ఆరోగ్యానికి మేలు

నేరేడు పండు.. దీన్ని జావా ప్లం, సిజిజియం క్యుమిని అని కూడా పిలుస్తుంటారు. ఇది ఎంతో రుచికరంగా ఉంటుంది. అంతేకాదు ఆరోగ్యానికి కూడా ఎంతో మంచిది. ఈ చిన్న, ముదురు ఊదా రంగు పండు యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలతో సమృద్ధిగా ఉంటుంది. ఆరోగ్యంగా ఉండాలనుకునేవారికి ఇది చాలా బాగా పనిచేస్తుంది. నేరేడు పండ్లు తింటే మనకు ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయి, అసలు దీన్ని ఎందుకు తినాలో ఓ సారి చూద్దాం.

### యాంటీఆక్సిడెంట్ పవర్హౌస్...

బ్లాక్ జామున్‌లోని ముఖ్య ప్రయోజనాల్లో ఒకటి దాని అధిక యాంటీఆక్సిడెంట్ కంటెంట్. యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడతాయి. ఇవి కణాలకు నష్టం కలిగించే హానికరమైన అణువులు. క్యాన్సర్, గుండె జబ్బులతో సహా వివిధ ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయి. ఇందుకోసం నేరేడు పండులోని ఆంథోసైనిన్లు, ఎల్లాజిక్ ఆమ్లం, టానిన్లు వంటి యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడి, వాపుతో పోరాడటానికి సహాయపడతాయి.

### రక్తంలో చక్కెర నియంత్రణ...

నేరేడు పండ్ల అత్యంత ముఖ్యమైన ప్రయోజనాల్లో ఒకటి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడే సామర్థ్యం. ఈ పండు రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను తగ్గించడానికి, ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరచడానికి సహాయపడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది డయాబెటిస్ లేదా ప్రీడయాబెటిస్ ఉన్నవారికి ఆహారంలో విలువైన సహాయకులుగా ఉంటుంది. పండ్లలోని యాంటీఆక్సిడెంట్లు డయాబెటిక్ న్యూరోపతి, మూత్రపిండాల నష్టం వంటి అధిక రక్తంలో చక్కెరకు సంబంధించిన సమస్యల నుండి రక్షించడానికి కూడా ఎంతో సహాయపడతాయి.

### విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా...

నల్ల జామున్ మొత్తం ఆరోగ్యానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలకు కూడా గొప్ప మూలం. ఇందులో విటమిన్ సి అధికంగా ఉంటుంది, ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఇంకా ఆరోగ్యకరమైన చర్మాన్ని ప్రోత్సహిస్తుంది. ఈ పండులో విటమిన్ ఎ కూడా ఉంటుంది, ఇది మంచి దృష్టికి ముఖ్యమైనది. విటమిన్ బి 6 ఇది మెదడు పనితీరు, జీవక్రియకు మద్దతు ఇస్తుంది. వీటితోపాటు పొటాషియం, కాల్షియం, ఇనుము వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి, ఇవి సరైన కండరాల పనితీరు, ఎముక ఆరోగ్యం, ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి అవసరం.

# అలోవెరా లాభాలు భళా..!



అలోవెరా.. ఔషధ లక్షణాల కోసం చాలామంది దీన్ని ఉపయోగిస్తుంటారు. కలబందను తినడానికి అత్యంత పాపులర్ పొందిన మార్గాలలో ఒకటి రసం రూపంలో ఉంటుంది. అలోవెరా రసం అనేక పోషకాలతో నిండి ఉంటుంది. అలాగే అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటుంది. ఇందులో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. అలోవెరా రసంలో మంచి ఆరోగ్యానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇందులో విటమిన్లు ఎ, సి, ఇ, బి విటమిన్లతో పాటు కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు ఉంటాయి. ఈ పోషకాలు రోగనిరోధక వ్యవస్థను పెంచడానికి, జీర్ణక్రియను మెరుగుపరచడానికి ఎంతగానో సహాయపడతాయి. ఇక కలబంద రసం మీ ఆరోగ్యానికి ఎందుకు మంచిదో ఓ సారి చూద్దాం.

### ...ర్ణక్రియకు సహాయపడుతుంది...

...లోవెరా రసం జీర్ణవ్యవస్థను ఉపశమనం చేసే సామర్థ్యానికి ప్రసిద్ధి ...ందింది. ఇది అజీర్ణం, ఉబ్బరం, మలబద్ధకం లక్షణాల నుండి ...పశమనం పొందడానికి సహాయపడుతుంది. అలోవెరా రసంలో ...యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు కూడా ఉన్నాయి. ఇవి పేగుల్లో ...ంటను తగ్గించడానికి అలాగే జీర్ణక్రియను మెరుగుపరచడానికి ...హాయపడతాయి.

### ...రీరాన్ని నిర్విషీకరణ చేస్తుంది...


...లబంద రసం సహజమైన నిర్విషీకరణగా పనిచేస్తుంది. శరీరం నుండి ...షాన్ని అలాగే మలినాలను తొలగించడానికి సహాయపడుతుంది. ఇది ...లేయం, మూత్రపిండాలను శుభ్రపరచడానికి మొత్తం నిర్విషీకరణను ...ోత్సహించడానికి ఇంకా ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ...హాయపడుతుంది.

### ...ర్మ ఆరోగ్యానికి తోడ్పడుతుంది...

...లబంద రసాన్ని అంతర్గతంగా తీసుకుంటే ప్రయోజనకరంగా ...ండటమే కాకుండా.., సమయోచితంగా అప్లై చేస్తే చర్మానికి ...ద్భుతమైన ప్రయోజనాలను అందిస్తుంది. ఇది గాయాలను నయం ...యడానికి, వాపును తగ్గించడానికి అలాగే కొల్లాజెన్ ఉత్పత్తిని ...ోత్సహించడానికి సహాయపడుతుంది. కలబంద రసం తాగడం వల్ల ...ర్మం ఆరోగ్యాన్ని లోపలి నుండి మెరుగుపరచడంలో ...హాయపడుతుంది.

### రోగనిరోధక శక్తిని పెంచుతుంది...

కలబంద రసంలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడానికి, హానికరమైన ఫ్రీ రాడికల్స్ నుండి శరీరాన్ని రక్షించడానికి సహాయపడతాయి. కలబంద రసాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం అనారోగ్యాన్ని నివారించడానికి అలాగే ఆరోగ్యంగా, శక్తివంతంగా ఉంచడానికి సహాయపడుతుంది.



# మీ ఆరోగ్యానికి ఏది మంచిది?

# టీ.. లేదా కాఫీ?

టీ లేదా కాఫీ లేనిది చాలా మందికి రోజు గడవదు. ఉదయం నిద్రలేవగానే టీ, కాఫీ తాగితేనే వారికి హాయిగా ఉంటుంది. కొందరికి ఒక్కపూట టీ, కాఫీ తాగకపోతే తలబద్ధలై పోయినట్లువుతుంది. కాగా, కొందరు టీ తాగడానికి ఇష్టపడుతుండగా.. మరి కొంతమంది కాఫీ తాగడానికి ఇష్టపడుతుంటారు. కానీ ఈ రెండింటిలో ఏదీ మన ఆరోగ్యానికి మంచిదని చాలా మందికి తెలియదు. టీ, కాఫీలో ఏది తాగడం వల్ల మన శరీరానికి ఆరోగ్యంగా పనిచేస్తుందని విషయానికి ఎప్పటికప్పుడు పలు అధ్యయనాలు వెల్లడిస్తూనే ఉన్నాయి. అసలు మన శరీర సంబంధించి ఏది తాగాలో ఒకసారి చూద్దామా..

### టీ.. ఓ ఆరోగ్యకరమైన ఎంపిక...

టీ, ముఖ్యంగా గ్రీన్ టీ దాని అనేక ఆరోగ్య ప్రయోజనాలకు చాలాకాలంగా వింటూనే ఉన్నాము. యాంటీఆక్సిడెంట్లతో నిండిన టీ జీవక్రియను పెంచుతుంది. అలాగే జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇంకా గుండె జబ్బుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. టీలో కనిపించే క్యాటెచిన్లు బరువు తగ్గడం, మెదడు పనితీరును మెరుగుపరచడంతో ముడిపడి ఉన్నాయి. వీటితోపాటు ఇంకా టీ అనేది ఆర్ద్రీకరణకు గొప్ప మూలం. అలాగే మనస్సును శాంతపరచడాని, ఒత్తిడిని తగ్గించడానికి ఇది ఎంతగానో సహాయపడుతుంది.





### కాఫీ.. ఓ వివాదాస్పద ఎంపిక...

ఇక ఆరోగ్యం విషయానికి వస్తే.. కాఫీకి కొంచెం మిశ్రమ పేరు ఉంది. కాఫీ త్వరగా శక్తిని అందించి, దృష్టిని మెరుగుపరుస్తుందనేది నిజం అయినప్పటికీ.. అధిక వినియోగం నిద్రలేమి, ఆందోళనలతోపాటు హృదయ స్పందన రేటు పెరగడం వంటి సమస్యలతో ముడిపడి ఉంది. అయితే, కాఫీలో యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. అలాగే అల్జీమర్స్, పార్కిన్సన్స్ వంటి కొన్ని వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

### మీ ఆరోగ్యానికి ఏది మంచిది...?

అంతిమంగా.. టీ, కాఫీ మధ్య ఎంపిక వ్యక్తిగత ప్రాధాన్యత. ప్రతి పానీయం మీ శరీరాన్ని ఎలా ప్రభావితం చేస్తుందనే దానిపై ఆధారపడి ఉంటుంది. మీరు కెఫిన్ పట్ల సున్నితంగా ఉంటే లేదా నిద్రపోవడంలో ఇబ్బంది ఉంటే 'టీ' మీకు మంచి ఎంపిక కావచ్చు. మరోవైపు, మీకు త్వరితగతిన కాఫీని తీసుకోవాలనుకుంటే లేదా కాఫీ రుచిని ఆస్వాదించాలనుకుంటే, మితంగా సేవించినప్పుడు అది ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగంగా ఉంటుంది.



# బయో వ్యర్థాలను కలిపితే కఠిన చర్యలు!



* నగరంలో 100 శాతం ఈ-వేస్ట్, బయోమెడికల్ వ్యర్థాల సేకరణే లక్ష్యం
* మున్సిపల్ చెత్తతో కలిపి పారబోయొద్దు: జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్
* 300 వార్డుల్లో ప్రత్యేక డ్రైవ్‌లు.. ప్రోత్సాహకాలుగా నగదు, కూపన్లు

హైదరాబాద్, మార్చి 4 (భారత శక్తి): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఈవేస్ట్ (ఎలక్ట్రానిక్ వ్యర్థాలు), బయోమెడికల్ వ్యర్థాల సేకరణలో సరికొత్త అధ్యాయానికి జీహెచ్ఎంసీ శ్రీకారం చుట్టింది. నగరంలో 100 శాతం శాస్త్రీయ వ్యర్థాల సేకరణే లక్ష్యంగా అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఈవేస్ట్ రీసైక్లర్లు, బయోమెడికల్ వ్యర్థాల శుద్ధి సంస్థలు, సీఎస్ఆర్ భాగస్వాములతో కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు.

**నిర్లక్ష్యం వహిస్తే నోటీసులే..**

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. బయోమెడికల్ వ్యర్థాలను ఎట్టిపరిస్థితుల్లోనూ సాధారణ మున్సిపల్ వ్యర్థాలతో కలుపరాదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే ఆసుపత్రులు, ఆరోగ్య సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఎంఓహెచ్‌లను ఆదేశించారు. "వ్యర్థాల సేకరణలో నిర్లక్ష్యం వహించే సంస్థలకు నోటీసులు జారీ చేస్తాం. నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి" అని ఆయన పిలుపునిచ్చారు. 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈ ప్రక్రియను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు.

**వారాంతాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు:**

ఎంఎంసీ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఈవేస్ట్ సేకరణ కోసం ప్రతి సర్కిల్‌లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు తమ వద్ద ఉన్న పాత ఎలక్ట్రానిక్ వస్తువులను స్వచ్ఛందంగా అందజేసేలా ప్రోత్సహించేందుకు ప్రతి శని, ఆదివారాల్లో 300 వార్డుల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తామని చెప్పారు. ఇందుకు ప్రతినిధులను నియమించుకోవాలని రీసైక్లింగ్ సంస్థలకు సూచించారు.

**నగదు లేదా కూపన్లు..**

ఈవేస్ట్ అందజేసే ప్రజలకు ప్రోత్సాహకాలు అందించేందుకు పలు సంస్థలు ముందుకు వచ్చాయి. కొన్ని సంస్థలు యూపీఐ (UPI) లేదా నగదు రూపంలో తక్షణ చెల్లింపులు చేసేందుకు అంగీకరించాయి. మరికొన్ని సంస్థలు సీఎస్ఆర్ కింద రిడీమబుల్ కూపన్లు అందించనున్నాయి. రిటైల్ వ్యాపారుల వద్ద ఉన్న సమాచారంతో డోర్ టుడోర్ సేకరణకు సమన్వయం చేయనున్నారు.

**మౌలిక వసతులు మా బాధ్యత:**

సేకరణకు అవసరమైన వేదికలను, మౌలిక వసతులను జీహెచ్ఎంసీ కల్పిస్తుందని అదనపు కమిషనర్ (శానిటేషన్) రవికిరణ్ స్పష్టం చేశారు. అయితే, వ్యర్థాల ధరలు, చెల్లింపుల అంశం పూర్తిగా ఆయా సంస్థల పరిధిలోనే ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్లు ప్రియాంక అల, రఘుప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎస్ఈ సృజన శ్రీ మరియు వివిధ రీసైక్లింగ్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.






## మన్సూరాబాద్‌లో రంగుల హరివిల్లు
# ఘనంగా హోలీ వేడుకలు

* పారిశుద్ధ్య కార్మికులతో కలిసి రంగులు పూసుకున్న మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, మార్చి 4 (భారత శక్తి) : మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. బుధవారం శ్రీరామ్ నగర్ కాలనీలోని భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యాలయ ప్రాంగణంలో రంగుల హరివిల్లును తలపించేలా వేడుకలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పలు కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, ముఖ్యంగా పారిశుద్ధ్య కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఒకరికొకరు రంగులు పూసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. హోలీ పండుగ సామాజిక ఐక్యతకు, సమానత్వానికి ప్రతీక అని కొనియాడారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి జరుపుకునే ఈ పండుగ సోదరభావాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. నిత్యం కాలనీల పరిశుభ్రత కోసం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను గౌరవిస్తూ, వారితో కలిసి పండుగ జరుపుకోవడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని ఆయన పేర్కొన్నారు. కాలనీవాసుల సంతోషమే ధ్యేయంగా ఇలాంటి వేడుకలు మరిన్ని జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు, బిజెపి నాయకులు కళ్లెం రవీందర్ రెడ్డి, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల నేతలు, పార్టీ కార్యకర్తలు, పారిశుద్ధ్య కార్మికులు మరియు హితైషులు పాల్గొన్నారు. మన్సూరాబాద్ వీధులన్నీ హోలీ రంగులతో కోలాహలంగా మారాయి.




# జిల్లా ఆర్థికాభివృద్ధిలో బ్యాంకర్లు భాగస్వామ్యం కావాలి

: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి




కడప, మార్చి 4 (భారత శక్తి): వికసిత భారత్, స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్య సాధనలో భాగంగా "విజన్ యాక్షన్ ప్లాన్ 202429" మేరకు జిల్లాను ఆర్థికంగా బలోపేతం చేయడంలో భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి బ్యాంక్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టెటివ్ కమిటీ (DCC), డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ (DLRC) బ్యాంకర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశించిన పలురకాల ఋణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ఆయా బ్యాంకుల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంతేకాకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశానుసారం వికసిత భారత్ లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణ ఆంధ్రప్రదేశ్ 2047 దిశగా "వైఎస్ఆర్ కడప జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ 202429" ప్రకారం జిల్లాను ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. రుణాలు అందించడంలో డిసెంబర్ మాసంతానికి గాను.. వైఎస్ఆర్ జిల్లా పురోగమనంలో లక్ష్యాన్ని అధిగమించినందుకు బ్యాంకర్లను అభినందించారు. బ్యాంకర్లు సమర్థవంతంగా పని చేస్తేనే ఆర్థిక వ్యవస్థ మరింత దృఢంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా జిల్లాలో డీఆర్డీఏ, మెప్మా పరిధిలోని అన్ని స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో పేదరిక నిర్మూలన, మహిళా అభివృద్ధి, సాధికారిత పొదుపు సంఘాల బలోపేతంలోనే సాధ్యం అవుతుందన్నారు. అన్ని రంగాల అభివృద్ధికి అపారమైన వనరులు ఉన్న ఆకాంక్ష జిల్లాను రాష్ట్ర, దేశ అభివృద్ధితో పాటు గ్లోబల్ ఎకానమీలో కీలక స్థానంలో నిలపాలన్నారు. డిఆర్డీఏ, మెప్మా శాఖల అధికారులు స్వయం సహాయక సంఘాల్లో ఆసక్తిని, బిజినెస్ స్కిల్స్ ను అభివృద్ధితో పాటు పొదుపు సంఘాల మహిళలకు రుణాలు అందించి జిల్లాను ఆకాంక్ష జిల్లా లక్ష్య సాధనలో బ్యాంకర్లు భాగస్వామ్యం కావాలన్నారు. సేంద్రియ సాగుబడిలో పండించిన పంట దిగుబడులకు మంచి ఆదరణ లభిస్తుందని ఎలాంటి హానికరం లేని నేచురల్ ఫార్మింగ్ ద్వారా వ్యవసాయ సాగుబడిని పెంచే అన్ని రకాల అధునాతన పద్ధతులకు అవసరమైన సాంకేతిక మౌలిక సదుపాయలను సమకూర్చుకునేందుకు రైతులకు అవసరమైన రుణాలను అందించేలా బ్యాంకర్లు ప్రోత్సహించాలన్నారు. ప్రత్యేకించి జేఎంఎల్ బిసి (జాయింట్ మండల లెవెల్ బ్యాంకర్స్ కమిటీ) మీటింగ్స్ కు సంబందిత అన్ని శాఖల అధికారులు ఖచ్చితంగా హాజరవ్వాలన్నారు. ఈ స్థాయి కమిటీ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు నూతన పరిశ్రమల ఆవిష్కరణకు అవసరమైన వనరులపై చర్చించాలన్నారు. అంతేకాకుండా కడప సమృద్ధి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రతి మండలం నుండి చురుకుగా ఉన్న స్వయం సహాయక గ్రూపులను, రైతులను గుర్తించి వారిని ఈ కామర్స్ బిజినెస్ లోకి అడుగులు వేసేందుకు ప్రోత్సహించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. జిల్లాలో త్వరలో ప్రారంభం కానున్న స్టార్ట్ అప్ కడప ఎంట్రప్రెన్యూర్ షిప్ కేంద్రం ద్వారా దాదాపు ఏడాదికి 100 వరకు నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను నిర్వహించి ఆయా రంగాల్లో యువతకు నైపుణ్యాలను అందించి ప్రొఫెషనల్ ఎంట్రప్రెన్యూర్లుగా అభివృద్ధి చేసే కార్యక్రమాలపై బ్యాంకర్లు కూడా భాగస్వామ్యం వహించి ఆర్థిక చేయూతను ఇవ్వాలన్నారు. అర్హులైన యువ పారిశ్రామిక వేత్తలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు లబ్ది చేకూర్చేలా రుణ సదుపాయాలు కల్పించాలన్నారు. అభివృద్ధి తిరోగమనంలో ఉన్న ఆయా బ్యాంకు శాఖలు అందుకు కారణాలను తెలియజేయాలన్నారు. అలాగే బడుగు బలహీన వర్గాల వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన "స్టాండప్ ఇండియా", ముద్ర, గ్రామీణ ఖాదీబోర్డు వంటి ప్రభుత్వ పథకాలతో పాటు పంట రుణాలు, విద్యా రుణాలను లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. సమాజంలో జరుగుతున్న ఆర్థిక, సైబర్ నేరాల పట్ల ప్రజల్లో విస్తృతస్థాయి అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక క్యాంపెయిన్స్ నిర్వహించాలన్నారు. అధిక మొత్తంలో అనుకోకుండా అనుమానాస్పద లావాదేవీలు ఏవైనా జరుగుతున్నాయని గుర్తించినట్లయితే అలాంటి లావాదేవీలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ముందుగా జిల్లా లీడ్ బ్యాంకు చీఫ్ మేనేజర్ జనార్ధనం డిసిసి, డిఎల్ఆర్సి సమావేశం కు సంబంధించిన అజెండా, వివరాలను, పలు శాఖల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న రుణాల ప్రగతిని ఆయా శాఖల అధికారులు కలెక్టర్ కి వివరించారు. 202526 ఆర్థిక సంవత్సరానికి గాను 2025 డిసెంబర్ 31వ తేదీ నాటికి జిల్లా క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.24,151.71 కోట్లు కాగా లక్ష్యాన్ని అధిగమించి రూ.25,888.15 కోట్ల మేర రుణాలు మంజూరు చేసి 107.53% ఆర్థిక ప్రగతిని సాధించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో నాబార్డు డీడీఎం విజయ విహారి, యూబీఐ ఎజిఎం లక్ష్మీ తులసి, కెడిసిసి సీఈఓ రాజమ్మ, ఎపిజిబి ఆర్ఎం శ్రీనివాస్, డిఆర్డీఏ, మెప్మా పిడీలు రాజ్యలక్ష్మి, కిరణ్ కుమార్, ఇండస్ట్రీస్ జీఎం చాంద్ బాషా, ఉద్యాన శాఖ జిల్లా అధికారి సతీష్‌కుమార్, మైనార్టీ వెల్ఫేర్ అధికారి హిదయతుల్లా, అనుబంధ శాఖల అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## లొంగిపోయిన మావోయిస్టు
# అగ్రనేత గణపతి..?



హైదరాబాద్, మార్చి 04 (భారత శక్తి): మావోయిస్టు పార్టీ అగ్రనేత గణపతి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎదుట లొంగిపోయినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. దీనిపై మరికొద్ది సేపట్లో కేంద్రప్రభుత్వం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే హోం శాఖ మంత్రి అమిత్ షాతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి తో పాటు డిజిపి శివధర్ రెడ్డి, ఎస్సైబీ చీఫ్ సుమతి, అడిషనల్ డీజీ వినయ్‌కుమార్ ఉన్నారు. మావోయిస్టుల అంతానికి కేంద్రప్రభుత్వం విధించిన డెడ్‌లైన్ ఈ నెలాఖరున ముగియనున్న నేపథ్యంలో గణపతి లొంగుబాటు కీలకంగా మారింది. అప్పటి పీపుల్స్ వార్‌లో చేరిన గణపతి దాదాపు నాలుగున్నర దశాబ్దాలుగా అజ్ఞాతంలోనే కొనసాగారు. సాయుధ పార్టీల విలీనం అనంతరం సుదీర్ఘకాలం మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు.

# ప్రశ్నించిన కౌన్సిలర్లు పారిపోయిన కమిషనర్



ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 04 (భారత శక్తి) : ములుగు మున్సిపాలిటీలో జరిగిన పలు సమస్యలపై ప్రశ్నించిన కౌన్సిలర్లు సమాధానం చెప్పకుండానే కార్యాలయం నుండి మున్సిపల్ కమిషనర్ పారిపోయారు. నూతనంగా ఏర్పడిన ములుగు మున్సిపాలిటీలో ఇటీవలే మున్సిపల్ ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే గత ఫిబ్రవరి 16న ములుగు పురపాలక సంఘం చైర్మన్ వైస్ చైర్మన్ లతోపాటు పూర్తిస్థాయి బాధ్యతలు పాలక సంఘం తీసుకుంది. కొన్ని అభివృద్ధి పనులు చేయాల్సి ఉండగా అందుకు సరిపడా నిధులను ఏర్పాటు చేసుకోవడానికి నేడు గురువారం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో కౌన్సిలర్ల సమావేశం నిర్వహించి అందరి ఆమోదంతో తీర్మానం చేయాల్సింది ఉండగా పురపాలక సంఘం ములుగు పరిధిలోని అన్ని వార్డులలో కొత్త వీధి దీపాల కొనుగోలు నిర్వహణ, ఎలక్ట్రిషన్ కి కావలసిన నిచ్చెనలు ఇతర పరికరాలు, కొత్త సబ్ మర్సిబుల్ మోటర్, వేసవి కాలానికి అనుగుణంగా నీటి సరఫరా నిర్వహణకు ఆగు కార్చు మున్సిపల్ పరిధిలోని గేట్ వాల్ రిపేర్ కొనుగోళ్లకు గాను పదిలక్షల 48 వేల రూపాయలను మున్సిపల్ జనరల్ ఫండ్ నిధుల నుండి ఖర్చు చేయుటకు కౌన్సిలర్లచే ఆమోదించనైనదని తీర్మానం కాపీ సిద్ధం చేసి దానిపై కమిషనర్ టి రమేష్ సంతకం చేయడంతో స్వతంత్ర అభ్యర్థిగా 9వ వార్డులో గెలిచిన గండ్రకోట వాణి కుమార్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు కోయిల లక్ష్మి, రేసోజు పద్మ, గోనెల భరత్ కుమార్ బైక్ అని సునీత. ఓదేలు,మాకు మొదటిసారి సమావేశం ఉన్నదని కొందరికి మాత్రమే సమాచారం అందించి మిగతా కౌన్సిలర్ కు సమాచారం అందించకపోవడం కేవలం అధికార పక్షం వారు మాత్రమే సమావేశం ఏర్పాటు చేసుకొని సంబంధిత ఖర్చుల నిమిత్తం పది లక్షల 48వేలు తీయడం సరికాదని 20 మంది కౌన్సిలర్ ఆధ్వర్యంలో తీర్మానాలు చేసిన వాటికి మాత్రమే ఖర్చులు తీయాలని కానీ అలాంటిదేం జరగకుండా కేవలం అధికారంలో ఉన్న మన ఉద్దేశంతో మున్సిపల్ కమిషనర్ తో కలిసి మున్సిపల్ పండును తీయడం మా మాటే చెల్లి తన ఉద్దేశంతో వారు ఈ యొక్క పని చేసినట్టు భావిస్తున్నామని తెలిపారు. ములుగు మున్సిపాలిటీ మొదటిసారి ఏర్పడడంతో అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కౌన్సిలర్ల గా తమ బాధ్యతను నిర్వహించాలని అనుకున్నాము కానీ అధికారంలో ఉన్న అధికార పార్టీ వాళ్లు మాత్రం మొదటి సమావేశానికి తోటి కౌన్సిలర్లకు సమావేశం ఇవ్వకుండా వారి ఇష్టానుసారం మున్సిపల్ చైర్మన్ తో కలిసి మున్సిపాలిటీ జనరల్ ఫండ్ నుండి వారే బడ్జెట్ ని నిర్ణయించుకొని కౌన్సిల్ సమావేశం అయిపోయినదని తెలుపడం విడ్డూరంగా ఉందని మేము కూడా ములుగు అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతాము కానీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వారికి తోచిన విధంగా చేయడం తోటి కౌన్సిలింగ్ అవమానించడమే అవుతుందని అభివృద్ధికి మేము ఆటంకం కాదని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాం ప్రతి సమావేశానికి అందని కౌన్సిలర్లకు సమాచారం అందించి అన్ని అభివృద్ధి పనులు అందర్నీ బావ సామలు చేస్తేనే మనం అనుకున్న అభివృద్ధి జరుగుతుందని అన్నారు.

# 26 రకాల వివరాలతో ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కార్డు

హైదరాబాద్, మార్చి 04 (భారత శక్తి): రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఒకే గొడుగు కిందకు తెచ్చేలా రూపొందిస్తున్న 'ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' (ఎఫ్ బీఎంఎస్) పై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా అసెంబ్లీలోని తన చాంబర్‌లో అధికారులతో ఆయన కీలక సమీక్ష నిర్వహించారు. ఫ్యామిలీ ఐడీ, ఆధార్, రైస్ కార్డ్, మొబైల్ నెంబర్, విద్యార్హతలు, వృత్తి, చిరునామా, వ్యవసాయ భూమి, ఇతర ఆస్తుల వివరాలు వంటి మొత్తం 26 రకాల అంశాలతో పకడ్బందీగా డేటాబేస్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ డేటాబేస్ రూపకల్పన కోసం ఎస్‌జీఎస్‌డబ్ల్యూ, డిస్కమ్స్, పురపాలక శాఖ, వెబ్‌ల్యాండ్, వాహన్, హెచ్‌ఆర్‌ఎంఎస్, పంచాయతీరాజ్, మార్క్‌ఫెడ్ వంటి వివిధ ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని సేకరించి ఇందులో పొందుపరచాలని సీఎం సూచించారు. ప్రస్తుతం 82 శాతం సమాచారం సిద్ధంగా ఉందని, వచ్చే ఏప్రిల్ 30 నాటికి 90 శాతం డేటాబేస్ పూర్తిచేస్తామని అధికారులు వివరించారు. సీనిపై స్పందించిన ముఖ్యమంత్రి..



ప్రభుత్వంలోని అన్ని శాఖల వద్ద ఉన్న డేటాను సమీకృతం చేయడం ద్వారానే సమాచారంలో కచ్చితత్వం పెరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి 'ఫ్యామిలీ కార్డు' అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, దీనికి అనుగుణంగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

## దుబాయ్‌లో డ్రోన్ కలకలం

### అమెరికా కాన్సులేట్ సమీపంలో పేలుడు..

దుబాయ్, మార్చి 04: మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలు ఇప్పుడు వాణిజ్య నగరం దుబాయ్‌కి పాకాయి. మంగళవారం రాత్రి అమెరికా కాన్సులేట్ జనరల్ కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడి జరగడం తీవ్ర కలకలం రేపింది. కాన్సులేట్ భవనానికి సమీపంలోని పార్కింగ్ స్థలంలో డ్రోన్ కుప్పకూలిపోవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న దుబాయ్ సివిల్ డిఫెన్స్ బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చాయి. ఈ ఘటనలో సిబ్బంది ఎవరికీ ఎలాంటి హాని జరగలేదని, అందరూ సురక్షితంగా ఉన్నారని అమెరికా అధికారులు ధ్రువీకరించారు. ఈ దాడి కారణంగా ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని దుబాయ్ మీడియా కార్యాలయం అధికారికంగా ప్రకటించింది. గత 48 గంటల్లో సౌదీ అరేబియా రాజధాని రియాద్, కువైట్‌లోని అమెరికా రాయబార కార్యాలయాలపై కూడా ఇరాన్ డ్రోన్లతో దాడులకు పాల్పడినట్లు తెలుస్తోంది. తమ దేశంపై అమెరికా జరిపిన దాడులకు ప్రతీకారంగానే ఈ చర్యలు చేపట్టినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా పరోక్షంగా వెల్లడించింది. ఈ పరిణామాలపై యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (UAE) తీవ్రంగా స్పందించింది. తమ భూభాగాన్ని ఇతర దేశాలపై దాడులకు వేదికగా మార్చడాన్ని సహించబోమని స్పష్టం చేసింది. అదే సమయంలో, తమ భద్రతకు ముప్పు వాటిల్లితే ఆత్మరక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. మరోవైపు, ఈ దాడులను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా పరిగణిస్తున్నారని, ఇరాన్‌ను అణ్వాయుధాలు సాధించకుండా నిరోధించడమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## శ్రీలంక తీరానికి సమీపంలో

## ఇరాన్ యుద్ధనౌకను ముంచేసింది మేమే

శ్రీలంక, మార్చి 04: శ్రీలంక తీరానికి సమీపంలో ఇరాన్ యుద్ధనౌకను ముంచేసింది తామేనని అమెరికా ప్రకటన చేసింది. తమ సబ్‌మెరైన్ దాడి కారణంగానే ఆ నౌక మునిగిపోయిందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ వెల్లడించారు. తాము అంతర్జాతీయ జలాల్లోనే ఈ దాడికి పాల్పడ్డామని ఆయన స్పష్టం చేశారు. శ్రీలంక దక్షిణ తీరంలో బుధవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకోగా.. అమెరికా ప్రకటనతో ఈ ఘటనపై స్పష్టత వచ్చింది. శ్రీలంక విదేశాంగ మంత్రి విజిత హెరత్ పార్లమెంట్‌లో తెలిపిన వివరాల ప్రకారం.. మునిగిపోయిన నౌకను ఇరాన్‌కు చెందిన 'ఐరిస్ దేనా'గా గుర్తించారు. ఇందులో దాదాపు 180 మంది సిబ్బంది ఉన్నట్లు సమాచారం. బుధవారం ఉదయం 6 నుంచి 7 గంటల ప్రాంతంలో ఈ నౌక నుంచి ప్రమాద సంకేతాలు (డిస్ట్రెస్ కాల్) అందడంతో శ్రీలంక నావికాదళం, వాయుసేన వెంటనే అప్రమత్తమయ్యాయి. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ఇప్పటివరకు 32 మందిని రక్షించి గాలేలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలంలో కేవలం నీటిపై చమురు తెట్టు తేలుతూ కనిపిస్తోందని, నౌక పూర్తిగా మునిగిపోయినట్లు అధికారులు తెలిపారు. శ్రీలంక భూభాగ జలాలకు ఆవల ఈ ఘటన జరిగినప్పటికీ... మానవతా దృక్పథంతో రక్షణ చర్యలు చేపట్టినట్లు లంక నేవీ ప్రతినిధి కమాండర్ బుద్ధిక సంపత్ తెలిపారు. ప్రస్తుతం ప్రాణాలను కాపాడటంపైనే తమ దృష్టి ఉందని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 18 నుంచి 25 వరకు బంగాళాఖాతంలో జరిగిన నావికా విన్యాసాల్లో ఈ నౌక పాల్గొన్నట్లు తెలుస్తోంది. సముద్రంలో కొన్ని మృతదేహాలను గుర్తించామని, గాలింపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.

## ఇవి మనిషి సృష్టించిన తీవ్ర విషాదాలు: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 04 (భారత శక్తి):ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా జరుపుతున్న దాడులు తీవ్రరూపం దాల్చాయి. దక్షిణ ఇరాన్‌లోని మినాబ్ పట్టణంలో ఉన్న 'షజ్రే తయ్యెబా' బాలికల ప్రాథమిక పాఠశాలపై జరిగిన మిస్సైల్ దాడిలో 165 మంది విద్యార్థినులు మరణించారన్న వార్త ప్రపంచవ్యాప్తంగా విషాదం కలిగించింది. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల శిథిలాల కింద చిక్కుకుని మరణించిన ఆ 165 మంది బాలికల సామూహిక అంత్యక్రియలకు సంబంధించిన వీడియోలు, ఫొటోలను కేటీఆర్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. యుద్ధం వెనుక కారణాలు ఏవైనా, ఇలాంటి మారణహోమాలు మనిషి సృష్టించిన తీవ్ర విషాదాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యుద్ధాలు రాబోయే తరాలకు కేవలం తీరని శోకాన్ని, వినాశనాన్ని మాత్రమే మిగుల్చుతాయని కేటీఆర్ హెచ్చరించారు.

## వర్సిటీలను బంధుగణంతో నింపేసి భ్రష్టుపట్టించారు

అమరావతి, మార్చి 04 (భారత శక్తి): ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థను దేశానికే ఆదర్శంగా నిలిపేలా 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్'ను ప్రపంచానికి చాటుదామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. శాసనసభలో విద్యాశాఖ బడ్జెట్ డిమాండ్ల ప్రతిపాదనల సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో విద్యారంగంలో జరిగిన విధ్వంసం, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలను సవివరంగా వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులందరూ ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని, వాటి బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

*** గత పాలనలో విధ్వంసం - విద్యావ్యవస్థ కుదేలు**

గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో విద్యాశాఖలో కోలుకోలేని విధ్వంసం జరిగిందని లోకేశ్ తీవ్ర విమర్శలు చేశారు. అనాలోచితంగా తీసుకొచ్చిన జీవో 117 వల్ల ప్రభుత్వ పాఠశాలలు తీవ్రంగా నష్టపోయాయని, వ్యవస్థ మొత్తం కుప్పకూలిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో ఏకంగా 10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారని గణాంకాలతో సహా వివరించారు. డ్రాప్ బాక్సుల విధానాన్ని దుర్వినియోగం చేసి, సుమారు 3 లక్షల మంది పిల్లల పేర్లతో మధ్యాహ్న భోజనం, కిట్ల నిధులను డ్రా చేసుకున్నారని ఆరోపించారు. కేవలం నంబర్లను మేనేజ్ చేయడానికే గత పాలకులు పరిమితమయ్యారని మండిపడ్డారు.

*** అధఃపాతాళానికి పడిపోయిన ప్రమాణాలు**

గత ప్రభుత్వ చర్యల వల్ల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు (లెర్నింగ్ అవుట్ కమ్స్) దారుణంగా పడిపోయాయని మంత్రి తెలిపారు. 2018లో 5వ తరగతి పిల్లలు గ్రేడ్2 తెలుగును 57 శాతం మంది అర్థం చేసుకోగలిగితే, గత ప్రభుత్వంలో అది 37 శాతానికి పడిపోయిందన్నారు. నేషనల్ ఎచీవ్ మెంట్ సర్వేలో 3వ తరగతి లాంగ్వేజ్ విభాగంలో ఏపీ 1వ ర్యాంకు నుంచి 27వ ర్యాంకుకు, మ్యాథ్స్ లో 5వ ర్యాంకు నుంచి 21వ ర్యాంకుకు పడిపోవడం గత పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఉపాధ్యాయులను వైన్ షాపుల వద్ద కాపలాకు పెట్టి అవమానించారని, ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదని లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

*** యూనివర్సిటీల్లో బంధుగణం - అక్రమ నియామకాలు**

విశ్వవిద్యాలయాలను గత ప్రభుత్వం రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చిందని మంత్రి ధ్వజమెత్తారు. వర్సిటీల్లో ఫ్యాకల్టీ నియామకాలను గాలికొదిలేసి, వీసీలుగా బంధువులను, అర్హత లేనివారిని నియమించి భ్రష్టుపట్టించారని విమర్శించారు. ఏయూ వీసీగా ప్రసాదరెడ్డిని నియమించి విద్యార్థులను రోడ్లపై నిలబెట్టారని, అర్హత లేకపోయినా మాజీ సీఎం బంధువు సుందరవల్లిని ఎస్వీయూ రెక్టార్ గా, విక్రమ సింహపురి వర్సిటీ వీసీగా నియమించారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా శ్రీకాంత్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, సురేంద్రనాథ్ రెడ్డి వంటి బంధువర్గానికి పదవులు కట్టబెట్టారని పేర్లతో సహా బయటపెట్టారు. వర్సిటీల్లో విగ్రహాలు పెట్టి, ఫ్లెక్సీలు కట్టి పవిత్రతను దెబ్బతీశారన్నారు. అంతేకాకుండా రూ.4 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టి వెళ్లిపోయారని తెలిపారు.

*** సంస్కరణల బాటలో ప్రజాప్రభుత్వం**

కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యాశాఖలో ప్రక్షాళన మొదలైందని లోకేశ్ తెలిపారు. జీవో 117 రద్దు చేసి, సింగిల్ టీచర్ విధానానికి స్వస్తి పలికామన్నారు. కేవలం 150 రోజుల్లోనే మెగా డీఎస్సీ నిర్వహించి 16 వేల పోస్టుల భర్తీ చేపట్టామని గుర్తుచేశారు. మరోవైపు యూనివర్సిటీల్లోని న్యాయపరమైన చిక్కులను 90 రోజుల్లో తొలగించి, త్వరలోనే అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తామని ప్రకటించారు. స్కూల్ కిట్స్, చిక్కీ, గుడ్ల సరఫరాలో అవినీతిని అరికట్టి రూ.1,000 కోట్లు ఆదా చేస్తున్నామని, ఈ నిధులను విద్యార్థుల సంక్షేమమేకే వెచ్చిస్తామని స్పష్టం చేశారు.

*** ఎమ్మెల్యేలకు పిలుపు - టెక్నాలజీ వినియోగం**

ప్రతి ఎమ్మెల్యే తమ పరిధిలోని రెండు పాఠశాలలను దత్తత తీసుకోవాలని, ప్రతి వారం స్కూళ్లను సందర్శించి ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని మంత్రి కోరారు. పిల్లల్లో 'పాసివ్ లెర్నింగ్' నుంచి 'యాక్టివ్ లెర్నింగ్' వైపు మార్పు తెచ్చేందుకు 'క్లిక్కర్ టెక్నాలజీ'ని ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు. అమరావతిలో ప్రపంచస్థాయి సెంట్రల్ లైబ్రరీని ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకోసం శోభా రియాలిటీ సంస్థ రూ.100 కోట్లు విరాళం అందించిందని సభకు తెలిపారు. చాగంటి కోటేశ్వరరావు గారి సలహాలతో పిల్లల్లో నైతిక విలువలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని, అందరం కలిసి ఏపీని విద్యాహబ్‌గా మారుద్దామని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు.

## డిజిటల్ జనగణనకు తెలంగాణ సిద్ధం..

## మే 11 నుంచి తొలి దశ

హైదరాబాద్, మార్చి 04 (భారత శక్తి): దేశవ్యాప్తంగా జరగనున్న జాతీయ జనాభా గణన (జనగణన) ప్రక్రియలో భాగంగా తెలంగాణలో తొలి దశ పనులను పకడ్బందీగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా మే 11 నుంచి జూన్ 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు, ఇతర కట్టడాల వివరాలను నమోదు చేసే కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లు, అన్ని శాఖల కార్యదర్శులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, కీలక మార్గదర్శకాలు జారీ చేశారు.

*** దేశంలోనే తొలిసారి డిజిటల్ లెక్కింపు**

ఈసారి జనగణన ప్రక్రియలో ఒక చారిత్రాత్మక మార్పు చోటుచేసుకోనుంది. దేశ చరిత్రలోనే మొదటిసారి జనాభా లెక్కలను పూర్తిస్థాయి డిజిటల్ విధానంలో చేపట్టనున్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా నేరుగా స్మార్ట్‌ఫోన్లలో వివరాలను నమోదు చేస్తారు. ఇది సమాచార సేకరణలో వేగాన్ని, కచ్చితత్వాన్ని పెంచుతుంది. అంతేకాకుండా, పౌరులు తమ వివరాలను తామే స్వయంగా నమోదు చేసుకునేందుకు "సెల్ఫ్‌ఎన్యూమరేషన్" పేరిట ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను కూడా అందుబాటులోకి తేనున్నారు. ఈ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ మే 11కి 15 రోజుల ముందు నుంచే ప్రారంభమవుతుందని సీఎస్ రామకృష్ణారావు తెలిపారు.

*** పక్కాగా వివరాలు నమోదు చేయాలి: సీఎస్**

క్షేత్రస్థాయిలో వివరాల సేకరణలో ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం ఉండకూడదని సీఎస్ స్పష్టంగా ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, మండలం భౌగోళిక సరిహద్దులను కచ్చితంగా నిర్ధారించుకోవాలని సూచించారు. మారుమూల గిరిజన తండాలు, పట్టణాల్లోని మురికివాడలతో సహా రాష్ట్రంలోని ఏ ఒక్క కట్టడాన్ని కూడా వదిలిపెట్టకుండా జాబితాలో చేర్చాలని ఆయన స్పష్టం చేశారు. ఈ బృహత్కార్యక్రమం విజయవంతం కావడానికి గణకులు, పర్యవేక్షకులకు నాణ్యమైన శిక్షణ ఇవ్వాలని కలెక్టర్లకు సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జనాభా లెక్కల విభాగం రాష్ట్ర సంచాలకురాలు భారతీ హోళికెరి, డేటా సేకరణ కోసం రూపొందించిన మొబైల్ యాప్ పనితీరు, సమాచార భద్రతకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ప్రతి ఒక్కరి బాధ్యతలను ఆమె విశదీకరించారు.

## గల్ఫ్‌లో ఉద్రిక్తతలు..

## భారతీయుల తరలింపునకు 58 ప్రత్యేక విమానాలు

ఢిల్లీ, మార్చి 04 (భారత శక్తి): మధ్యప్రాచ్యంలో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన భారతీయులను స్వదేశానికి తరలించేందుకు భారత విమానయాన సంస్థలు భారీ ఆపరేషన్ చేపట్టాయి. ఇవాళ ఒక్కరోజే 58 ప్రత్యేక విమానాలను నడుపుతున్నట్లు కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఇందులో ఇండిగో 30 విమానాలను, ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ కలిసి 23 విమానాలను నడపనున్నాయి. పశ్చిమాసియాలోని చాలా దేశాలు తమ గగనతలాన్ని మూసివేయడం లేదా కఠిన ఆంక్షలు విధించడంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సంక్షోభ పరిస్థితుల్లో చిక్కుకున్న భారతీయులను సురక్షితంగా వెనక్కి తీసుకురావడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకున్నారు. ఎయిర్ ఇండియా, ఇండిగో, స్పైస్‌జెట్, ఆకాశ ఎయిర్ వంటి సంస్థలు దుబాయ్, ఫుజైరా వంటి నగరాల నుంచి ఈ ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నాయి. ఈ విమానాలు న్యూఢిల్లీ, ముంబై, బెంగళూరు, కొచ్చి, అహ్మదాబాద్, తిరువనంతపురం విమానాశ్రయాలకు చేరుకోనున్నాయి. ప్రస్తుతం దుబాయ్ గగనతలం పాక్షికంగా మాత్రమే తెరిచి ఉంది. పరిమిత సంఖ్యలో విమానాలకు అనుమతినిస్తున్నారు. ఈ నేపథ్యంలో విమానయాన సంస్థ నుంచి నిర్ధారిత బయలుదేరే సమయం గురించి సమాచారం అందిన తర్వాతే విమానాశ్రయానికి రావాలని అధికారులు ప్రయాణికులకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు. అప్పటివరకు దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం లేదా అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లవద్దని కోరారు. మరోవైపు అబుధాబి నుంచి తమ కార్యకలాపాలను గురువారం (మార్చి 5వ తేదీ) మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు ఎతిహాద్ ఎయిర్‌వేస్ ప్రకటించింది. ప్రయాణికుల భద్రతే తమకు అత్యంత ముఖ్యమని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. రిఫండ్‌లు, రీషెడ్యూలింగ్, ఇతర సహాయక చర్యల విషయంలో ప్రయాణికులతో పారదర్శకంగా వ్యవహరించాలని అన్ని విమానయాన సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్లిష్ట సమయంలో విమాన టికెట్ల ధరలు అదుపు తప్పకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ప్రయాణికులపై అనవసర భారం పడకుండా చూస్తామని మంత్రిత్వ శాఖ హామీ ఇచ్చింది.

## జూన్ నాటికి సింగూరు డ్యామ్ సేఫ్టీ పనులను

## పూర్తి చేయాలి

హైదరాబాద్, మార్చి 04 (భారత శక్తి): సింగూర్ ప్రాజెక్టు కాలువల లైనింగ్ పనులను జూన్ 26లోగా పూర్తిచేయాలని ఇరిగేషన్ శాఖ ఇంజనీరింగ్ అధికారులకు రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర సచివాలయంలో భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధ్యక్షతన సింగూరు ప్రాజెక్టు డ్యాం సేఫ్టీపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, మైనింగ్, ఉపాధి కల్పన శాఖ, మెదక్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, ఇరిగేషన్ శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఈ. శ్రీధర్, ఇరిగేషన్ శాఖ ముఖ్య అధికారులు, ఈఎన్సీలు, ఇంజనీరింగ్ శాఖ ముఖ్య అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన సింగూరు డ్యాం సేఫ్టీపై రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ ఉత్తమ్ కుమార్ రెడ్డి వివేక్ వెంకటస్వామిలు చర్చించారు. డ్యామ్ సేఫ్టీ ప్రభుత్వానికి ఎంతో ప్రాధాన్యత అంశం అన్నారు. నేషనల్ డ్యామ్ సెక్యూరిటీ సంస్థ రూపొందించిన నిబంధనల మేరకు సింగూర్ డ్యాం ను పరిరక్షించాలని మంత్రులు ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు.

## హైదరాబాద్ బాచుపల్లిలో భారీ అగ్నిప్రమాదం ..

హైదరాబాద్, మార్చి 04 (భారత శక్తి): హైదరాబాద్ బాచుపల్లిలో గత రాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మియాపూర్ బాచుపల్లి ప్రధాన రహదారి పక్కన ఉన్న ఫర్నిచర్ దుకాణాల్లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కానీ, కోట్లాది రూపాయల ఆస్తి నష్టం వాటిల్లినట్టు తెలుస్తోంది. మంగళవారం రాత్రి సుమారు 10:45 గంటల సమయంలో ఓ దుకాణంలో మొదలైన మంటలు, క్షణాల్లోనే పక్కనున్న షాపులకు వేగంగా వ్యాపించాయి. దుకాణాల్లో కలప, ఫర్నిచర్, ఫోమ్ వంటి తేలికగా మండే పదార్థాలు అధికంగా ఉండటంతో అగ్నికీలలు పెద్ద ఎత్తున ఎగసిపడ్డాయి. దీనికితోడు, కొన్ని దుకాణాల్లో నిల్వ ఉంచిన వంట గ్యాస్ సిలిండర్లు భారీ శబ్దాలతో పేలడంతో మంటల తీవ్రత మరింత పెరిగింది. అక్కడ 25 వరకు ఫర్నీచర్ దుకాణాలు ఉండగా, ఒక్కో షాపులో లక్షల విలువైన కలప సామాగ్రి నిల్వ ఉంది. నిమిషాల వ్యవధిలో 18 షాపులకు మంటల వ్యాపించాయి. కొందరు వ్యాపారులు అందులోనే నివాసం ఉంటున్నారు.

# భగత్ సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 12-17 వరకు క్రికెట్ టోర్నమెంట్

* **ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్**
* **క్రికెట్ పోస్టర్ ను విడుదల చేసిన రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి**

హైదరాబాద్, మార్చి 04 (భారత శక్తి): షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 95వ వర్ధంతి సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మార్చి 1217 తేదీలలో ఉస్మానియా యూనివర్సిటీ క్రికెట్ గ్రౌండ్లో క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహిస్తున్నట్లు, ఈ టోర్నమెంట్ కు సంబంధించిన గోడ పత్రికను తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డితో విడుదల చేయించడం జరిగింది.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి ఆర్. బాలకృష్ణ, నెర్లకంటి శ్రీకాంత్ లు సంయుక్తంగా మాట్లాడుతూ, భగత్ సింగ్ దేశ స్వాత్రంత్ర్యలో కీలక భూమిక పోషించారని, అటువంటి మహనీయుడిని స్మరిస్తూ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని వారు అన్నారు.ఆరు రోజుల పాటు నిర్వహించే ఈ టోర్నమెంట్ ను రాష్ట్ర పరిధిలోని యువజన, క్రీడల శాఖ మాత్యులు వాకిటి శ్రీహరి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు,సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటీ. నర్సింహా,




ఏమినెంట్ క్రీడాకారులు ముఖ్య అతిథిలుగా హాజరై ప్రారంబించనున్నారని, అదే విధంగా జిల్లా యువజన క్రీడాశాఖ అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారని వారు ప్రకటించారు. ఈ టోర్నమెంట్ లో పాల్గొనాలనే యువత ఈ క్రింది నంబర్లను సంప్రదించాలని కో ఆర్డినేటర్ శ్రీకాంత్ 7386690103, ఆర్గనైజర్స్ బాలకృష్ణ 8885173361, మహమూద్ 8121347855 అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్,కార్యవర్గ సభ్యులు కళ్యాణ్,జోసెఫ్ భాను, అనీల్ కుమార్ పాల్గొన్నారు.



## జవహర్ నగర్‌లో
# జోరుగా హోలీ సంబరాలు

జవహర్ నగర్, మార్చి 4 (భారత్ శక్తి) : జోహర్ నగర్ (ప్రాంతంలో) హోలీ పండుగను స్థానికులు ఘనంగా, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. చిన్నారులు నుంచి పెద్దల వరకు రంగుల వర్షంలో తడిసి ముద్దవుతూ "హ్యాపీ హోలీ" శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఉదయం నుంచే యువతులు, యువకులు బృందాలుగా చేరి ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. సంప్రదాయ పాటలు, డీజే సంగీతం మధ్య వాతావరణం ఉత్సాహభరితంగా మారింది. మహిళలు ప్రత్యేకంగా తయారు చేసిన పిండివంటలు, స్వీట్లు పంచుకుంటూ పండుగను ఆనందంగా గడిపారు. పర్యావరణ హిత హోలీకి ప్రాధాన్యత ఇస్తూ సహజ రంగులను మాత్రమే ఉపయోగించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా స్థానిక పోలీసుల పర్యవేక్షణలో వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచే హోలీ పండుగను జవహర్ నగర్ ప్రజలు ఉత్సాహంగా జరుపుకోవడం విశేషంగా నిలిచింది.



# అంబరాన్ని అంటిన హోలీ సంబురాలు

ఎల్బీనగర్, మార్చి 04 (భారత శక్తి): ప్రభుత్వం మంగళవారం హోలీ పండుగకు సెలవు ప్రకటించగా, బుధవారం ప్రైవేట్ వ్యాపార వాణిజ్య సంస్థలు సెలవులు ప్రకటించాయి. రెండు రోజులు జనాలు హోలీ సంబురాలలో మునిగిపోయారు. నిన్న చంద్రగ్రహణం వలన కొంతమంది హోలీ జరుపుకోగా, బుధవారం అంతే సందడిగా ఎల్బీనగర్, చంపాపేట్, దిల్ సుఖ్ నగర్, సరూర్నగర్ ప్రాంతాలలో పిల్లలు, యువత, పెద్దలు హోలీ పండుగ కేరింతలతో సంతోషంగా జరుపుకున్నారు.





చైతన్యపురి డివిజన్ భారాస యువ నాయకుల హోళీ పండుగ సంబురాలు. ఒకరి పై ఒకరు రంగులు చల్లుకుంటూ సంతోషకరమైన క్షణాలు అనుభవించిన రక్షిత హాస్పిటల్ ఎండి డాక్టర్ రాంప్రసాద్ భారాస నాయకులు విశ్వ ప్రేమ్ కుమార్, సునీల్ అగర్వాల్, కంప్యూటర్ సాయి, టిల్లు ధన్ రాజ్ తదితరులు..

ఎల్బీనగర్, మార్చి 04 (భారత శక్తి):

# సమర్థవంతంగా పనిచేస్తున్న హైడ్రా..!

* **పునరుజ్జీవన బాటలో మరో రెండు చెరువులు:**
* **ఈ నెల 6న బమ్మకున్-ఉద్-దౌలా ప్రారంభం.. త్వరలోనే నల్లచెరువు**
* **నగరవాసులకు అందుబాటులోకి రానున్న హైడ్రా అభివృద్ధి పనులు**

హైదరాబాద్, మార్చి 4 (భారత శక్తి) : నగరంలోని చెరువుల రూపురేఖలను మార్చేందుకు హైడ్రా చేపట్టిన కార్యాచరణ సత్ఫలితాలనిస్తోంది. మొదటి విడతలో భాగంగా అభివృద్ధి చేసిన మరో రెండు చెరువులు ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి. పాతబస్తీలోని చారిత్రక బమ్మకున్ ఉద్ దౌలా చెరువును ఈ నెల 6న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనుండగా, మరో నాలుగైదు రోజుల్లో కూకట్‌పల్లిలోని నల్లచెరువును కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇప్పటికే అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటను గతేడాది ప్రారంభించిన విషయం తెలిసిందే. రెండో విడతలో మరో 14 చెరువులను అభివృద్ధి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

* **పాతబస్తీకి మణిహారం.. బమ్మకున్-ఉద్-దౌలా:**

నిజాం కాలం నాటి చారిత్రక వైభవాన్ని చాటేలా బమ్మకున్ ఉద్ దౌలా చెరువును హైడ్రా తీర్చిదిద్దింది. 1970లో అప్పటి ప్రధాని నవాబ్ రుక్న్ఉద్‌దౌలా నిర్మించిన ఈ చెరువు, కాలక్రమేణా ఆక్రమణలకు గురై 4.12 ఎకరాలకు కుంచించుకుపోయింది. 2024 ఆగస్టులో హైడ్రా ఆక్రమణలను తొలగించి మొత్తం 17.05 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంది. చెరువు కట్టను పటిష్ఠం చేసి వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, చిన్నారుల ప్లే ఏరియా, గజబోలను నిర్మించారు. ఔషధ గుణాలున్న మొక్కలను నాటడమే కాకుండా, భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి హైడ్రా ప్రధాన కార్యాలయం నుంచి పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నారు. రాజేంద్రనగర్, ఆరాంఘర్ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు చెరువులోకి చేరేలా ఇన్‌లెట్లను అభివృద్ధి చేశారు.

**విహార కేంద్రంగా నల్లచెరువు:**





కాంక్రీట్ జంగిల్‌గా మారిన కూకట్‌పల్లి ప్రాంతంలో నల్లచెరువు ఇప్పుడు విహార కేంద్రంగా మారింది. గతంలో 16 ఎకరాలకు పరిమితమై మురుగుకూపంగా ఉన్న ఈ చెరువును హైడ్రా 30 ఎకరాలకు విస్తరించింది. ఎఫ్‌టీఎల్ పరిధిలోని 16 వాణిజ్య షెడ్లను తొలగించి, భారీగా పేరుకుపోయిన వ్యర్థాలను బయటకు తీశారు. ప్రస్తుతం ఇక్కడ కిలోమీటరున్నర మేర పాత్‌వే అందుబాటులోకి వచ్చింది. బోటింగ్ సౌకర్యం, ఐలాండ్స్ ఏర్పాటుతో సందర్శకుల తాకిడి పెరిగింది. ఈ చెరువు అభివృద్ధి పనులను బుధవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. చెరువు చుట్టూ పార్కులు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని, ఎస్టీపీ (మురుగునీటి శుద్ధి కేంద్రం) ఏర్పాటుకు జలమండలితో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.

* **బాచుపల్లిలో భారీ అగ్నిప్రమాదం: 22 దుకాణాలు దగ్ధం**
* **షాట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు.. రంగంలోకి హైడ్రా డీఆర్ఎఫ్ బృందాలు**



కుత్బుల్లాపూర్ మండలం బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని విఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి కళాశాల సమీపంలో మంగళవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. కేజీఆర్ కన్వెన్షన్ పక్కనే ఉన్న ఫర్నిచర్ దుకాణాల్లో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. సమాచారం అందుకున్న వెంటనే హైడ్రాకు చెందిన 5 డీఆర్ఎఫ్ బృందాలు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. బుధవారం ప్రమాద స్థలాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ జరగడం వల్లే నిప్పురవ్వలు ఎగిసిపడి మంటలు వ్యాపించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు 22 దుకాణాలు కాలిబూడిదయ్యాయి. ఒక్కో దుకాణంలో రూ. 25 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు వాపోతున్నారు. వేసవి కాలం దృష్ట్యా వ్యాపార సముదాయాలు ఫైర్ సేఫ్టీ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకునే అధికారం హైడ్రాకు కట్టబెట్టాలని ప్రభుత్వానికి నివేదించినట్లు కమిషనర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# హోలీ సంబరాల్లో...

* **రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు వల్లకాటి రాజ్ కుమార్.**

మేడ్చల్ జిల్లా మల్కాజ్గిరి (భారత్ శక్తి) : తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పద్మశాలి సంఘం కార్యాలయంలో ఘనంగా హోలీ సంబరాలు నిర్వహించారు.హోలీ పండుగ సందర్భంగా హైదరాబాద్ జి హెచ్ ఎం సి పద్మశాలి సంఘాల అధ్యక్షులు మరియు వారి కార్యవర్గ సభ్యులు అందరు కలసి తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం కార్యాలయం లో అధ్యక్షులు వల్లకటి రాజకుమార్ ను కలిసి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రాజకుమార్ తెలంగాణ పద్మశాలి కులబంధావులందరికి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా రంగుల్లా, మన జీవితాలు కూడా ఆనందంతో ఐక్యతతో నిండిపోవాలని ద్వేషాలను దూరం చేసి ప్రేమ, సఖ్యతను పెంపొందించేది పండుగలు అని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమం లో వివిధ సంఘాల అధ్యక్షులు మరియు కార్యదర్శులు పాల్గొన్నారు. పద్మశాలి ఎగ్జిబిషన్ ఎక్సపో ఫౌండర్ ఇప్పలపల్లి రమేష్ , కోశాధికారి బింగి నవీన్ ,ఉపాధ్యక్షులు వనమాల శంకర్ , ఆఫీస్ జనరల్ సెక్రటరీ వాడిచెర్ల మారుతీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎలిగేటి దేవేందర్, వల్లకటి శ్రీనివాస్, బొల్లిగూడెం సంఘం అధ్యక్షులు రచ్చ శ్రీనివాస్, ఆల్వాల్ సంఘం అధ్యక్షులు ఎర్రగుంట శ్రీనివాస్, కోశాధికారి రచ్చ వెంకటేష్, కృష్ణ మూర్తి,సెక్రటరీ సూర్య ప్రకాష్ , ధ్రువకుమార్, శ్రీరామ్ మధు మరియు వివిధ సంఘాల కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.





Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.